INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక

జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

మంగళవారం 06.08.2024
INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 32 సంచిక - 171 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# అభివృద్ధే లక్ష్యంగా...

- కలెక్టర్లకు వంద రోజుల ప్రణాళిక
- ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టేది మీరే
- రాష్ట్ర పునర్నిర్మాణానికి ఈ కలెక్టర్ల సదస్సు ఎంతో కీలకం
- రాష్ట్ర పునర్నిర్మాణం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- పాలనలో పారదర్శకత, నాణ్యత ప్రమాణాలు పాటించండి
- ప్రభుత్వ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాల్సింది కలెక్టర్లే
- జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం సచివాలయంలో కలెక్టర్లతో సమావేశం అయ్యారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి భేటీ ఇదే కావడం గమనార్హం. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇవాళ జరుగుతున్న కాన్ఫరెన్స్ చరిత్రాత్మకమైన కాన్ఫరెన్స్ అని, చరిత్ర తిరగరాయబోతోందని అన్నారు. అయిదేళ్లకు ముందు ఇదే కలెక్టర్ కాన్ఫరెన్స్‌లో అప్పటి ముఖ్యమంత్రి ప్రజావేదికను కూలగొడతానని అన్నారని, గతంలో తాను సీఎం అయినప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని... అయితే ఇప్పుడు మాత్రం ఆఫీసర్లలో మోరల్ దెబ్బతిన్నదని అన్నారు. ఈ రాష్ట్రానికి బ్రాండ్ ఏపీ దెబ్బతిన్నదని... అధికారుల మనోభావాలను దెబ్బతీసారన్నారు.

ఢిల్లీకి ఇక్కడి నుంచి వెళ్లిన వారు కేంద్రంలో, ఆర్‌బీఐలో చాలా కీలకం అ-య్యారని.. వరల్డ్ బ్యాంకులో కూడా పనిచేశారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. చిన్న తప్పు జరిగితే దాన్ని సరిచేయెచ్చు... అయితే విధ్వంసం జరిగిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే ఎంతో ప్రయత్నం చేయక తప్పదన్నారు. తాను మొదటి సారి ముఖ్యమంత్రి అయినప్పుడు కరెంటులేని గ్రామాలు ఉన్నాయని... ఇప్పుడు డ్రైవర్ లెస్ కార్లు వచ్చేశాయన్నారు. గతంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాక కాంపిటేటివ్ ఎకానిమీగా పోటీ పడ్డామని.. 2029కి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ గట్టిగా పనిచేస్తే 2047 నాటికి మొదటి స్థానంలోకి వెళుతామని పేర్కొన్నారు. మనం గణితంలో ఎంతో ముందున్నామని... బ్రిటిష్ వారు ఇంగ్లీష్‌ను వదిలి పెట్టిపోయారని, ఈ రెండు ఐటికి డెడ్లీ కాంబినేషన్ దాన్ని అందిపుచ్చుకున్నామన్నారు.

**ప్రజలకు జవాబుదారీగా ...**

చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సదస్సులో మాజీ సీఎం జగన్ పేరు ఎత్తకుండానే.. ఆయన వ్యవహారశైలిని అధికారులకు అర్థమయ్యేలా చెప్పారు. ఎమ్మెల్యేలంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఆదేశించామని, అధికారులు సైతం ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అహంకారపూరిత ధోరణితో, డిక్టేటర్‌గా వ్యవహరిస్తే ఏమవుతుందో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రజలు మ్యాండేట్ ఇవ్వడంతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని.. ఐదేళ్ల తర్వాత మళ్లీ ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతామని.. వారి ఓట్లు వేస్తే మరోసారి ప్రభుత్వంలోకి వస్తామని.. లేకపోతే అసెంబ్లీకి కూడా రాలేమన్నారు. గత ప్రభుత్వం డిక్టేటర్‌గా వ్యవహరించడంతోనే మాజీ మంత్రులంతా ఎన్నికల్లో ఓడిపోయారని కేవలం ఒకరు మాత్రమే గెలిచి అసెంబ్లీకి వచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. దీంతో అధికారులు ఎలా ఉండాలనేదానిపై సీఎం చంద్రబాబు ఓ సందేశాన్నిచ్చారు.

1995 హైదరాబాద్‌లో బెస్ట్ ఎకోసిస్టమ్ క్రియేట్ చేయగా.. దాన్ని తరువాత వచ్చిన వారు కొనసాగించారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచంలో అతి ఎక్కువ పెర్ కెపిటా ఇన్ కం సాధించిన వారు ఇండియన్స్ అని.. అందులో 30 శాతం తెలుగువారు ఉన్నారన్నారు. ఈ అయిదేళ్లలో ఎన్నివిధాల ఇబ్బందులు పడ్డామో.. అన్ని విధాలా భాదింపబడ్డామన్నారు. ఎన్నికల్లో పునర్‌నిర్మాణం చేస్తామని పవన్ కళ్యాణ్, తాను హామీ ఇచ్చామని... ఇంకా ఎన్నో సమస్యలు వచ్చాయని తెలిపారు. ఈ రాష్ట్రం దశ దిశను సూచించేదిగా ఈ కలెక్టర్ కాన్ఫరెన్స్ ఉంటుందన్నారు. ప్రజా వేదిక ఉంటే అక్కడ పెట్టేవాళ్లమని, బటయపెట్టడం ఇష్టం లేక ఇక్కడే పెట్టామని చెప్పారు. గత ప్రభుత్వం అయిదేళ్లలో ఒక్కసారి కూడా కలెక్టర్ కాన్ఫరెన్స్ పెట్టలేదంటే ఎంతదారుణమో అర్థం చేసుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు.

**ఇసుక సామాన్యుడి హక్కు**

అమరావతి: ఇసుక కావాల్సిన వినియోగదారులు తమ ప్రాంతంలోని సచివాలయంలో ఇసుక బుక్ చేసుకునే విధానం తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గనుల శాఖ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. ఇసుక ప్రకృతి ప్రసాదించిన సహజ వనరు అని, అది సామాన్యుడి హక్కు అని, దాన్ని ఎవరికి వారు ఇష్టానుసారం దోచుకోవడాన్ని తమ ప్రభుత్వం సహించదన్నారు. సామాన్యులందరికీ ఇసుక ఉచితంగా లభించేలా పూర్తి పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇసుక కావాల్సిన వినియోగదారులు ఇకపైన తనకు ఎంత ఇసుక కావాలో తమ ప్రాంతంలోని సచివాలయంలోనే బుకింగ్ చేసుకునే విధానం తీసుకొస్తున్నామని, ఇసుక రీచ్ నుంచి తన ఇంటికి ఇసుక తీసుకెళ్లడానికి రవాణ ఛార్జీలు కూడా సచివాలయంలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రీచ్ నుంచి ట్రక్కులో ఇసుక వినియోగదారుడి ఇంటికి చేరిన తరువాత, వినియోగదారుడు తనకు ఇసుక చేరిందని చెప్పిన తరువాతే ఆ రవాణ ఖర్చులు ఆ ట్రక్కు యజమానికి రిలీజ్ చేసేలా పద్ధతి తీసుకొస్తామన్నారు. ఇసుక తీసుకెళ్లడానికి ఉపయోగించే ట్రక్కులన్ని కూడా ప్రీపెయిడ్ టాక్సీల తరహాలో ఊబరైజేషన్ చేస్తామని చెప్పారు. రేట్లు కూడా స్టండర్డైజేషన్ చేస్తామన్నారు. పేదలకు, సామాన్యులకు చెందాల్సిన ఇసుక పక్కదారి పట్టించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇసుకలో ఉదాసీనంగా వ్యవహరించి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని ఆయన అధికారులకు సూచించారు.

**మున్సిపాల్టీలోనూ చెత్త కనపడటానికి వీల్లేదు**

2లో

## ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వండి

### అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రజాప్రతినిధులతో అధికారులు ఎలా వ్యవహరించాలనే దానిపై చంద్రబాబు సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో క్లారిటీ ఇచ్చారు. రానున్న ఐదేళ్లు ప్రభుత్వ పాలన ఎలా ఉండాలి.. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటో సీఎం అధికారులకు ఫుల్ క్లారిటీ ఇచ్చారు. గతాన్ని ఎక్కువుగా తవ్వకుండానే.. తప్పిదాలను మర్చిపోయి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎలా ముందుకెళ్లాల్లో స్పష్టం చేశారు. బాగా పనిచేసే అధికారులకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని, ఎవరైనా తప్పులు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. తప్పు చేయాలని తాను అధికారులకు చెప్పబోనని.. కాని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చే సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. అద్భుతాలు సృష్టించగల ఎంతోమంది మంచి అధికారులు ఉన్నప్పటికీ.. వారి సేవలను ఉపయోగించుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ఓ రకంగా చెప్పాలంటే ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు మొదటి సదస్సులోనే స్వీట్ వార్నింగ్ ఇచ్చారు.

ప్రజల్లో ఉండేది నాయకులని.. ఐదేళ్లకోసారి ప్రజాతీర్పును కోరవలసి ఉంటుందన్నారు. ఎవరైనా ప్రజా ప్రతినిధులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే తక్షణమే వాటిని పరిష్కరించి.. ఆ క్రెడిట్‌ను నాయకుడికి ఇవ్వాలని.. అధికారులు ఆ సమస్యను సొంత సమస్యగా భావించి.. త్వరితగతిన పరిష్కార మార్గం చూపించాలన్నారు. మొదటి సదస్సులో ప్రారంభ ఉపన్యాసంలోనే అధికారులు ఎలా ఉండాలో చంద్రబాబు పూసగుచ్చినట్లు వివరించారు.

## జగన్ కు సీఎం హోదా భద్రత కుదరదు..



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తనకు సెక్యూరిటీ తగ్గించారని ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఉన్న సెక్యూరిటీనే ప్రభుత్వం కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కల్పించిన భద్రత ప్రాముఖ్యతను పిటిషన్ లో గుర్తు చేశారు. అయితే జగన్ పిటిషన్ పై పోలీస్ శాఖ, ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. సీఎం హోదాలో అదనంగా ఇచ్చే భద్రతను మాత్రమే తగ్గించామని స్పష్టం చేశాయి. ఇప్పుడు అదే సెక్యూరిటీ కల్పించడం కుదరదని తేల్చి చెప్పాయి. జగన్కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ కొనసాగుతుందని పేర్కొన్నాయి. నిబంధనల ప్రకారమే జగన్కు భద్రత కల్పిస్తున్నామని వెల్లడించాయి. జగన్కు భద్రత తగ్గించారన్న వాదనను కొట్టిపారేశాయి.

## పేదవాడికి న్యాయం జరిగేలా ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ చట్ట సవరణ

- రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన ల్యాండ్ గ్రాబింగ్ అంశం పునరావృతం కాకుండా ఉండేందుకై పేదవాడికి న్యాయం జరిగేలా ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని సవరించనున్నట్లు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1982 ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టును అనుసరించి గుజరాత్

2లో

## నమ్మిన ప్రజలకు న్యాయం చేద్దాం : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకానికి న్యాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నామన్న ఆయన.. వ్యవస్థలను బతికించాలనే ఉద్దేశంతోనే అన్నీ తట్టుకొని నిలబడ్డామన్నారు. కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. “బలోపేతమైన వ్యవస్థలను గత ప్రభుత్వం ఆటబొమ్మలుగా మార్చింది. పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. పాలన ఎలా ఉండకూడదో గత ఐదేళ్ల పాలన తెలియజేసింది. గ్రామ పంచాయతీలను బలోపేతం చేసే దిశగా ముందడుగు వేస్తున్నాం. ఒకేరోజు రాష్ట్రంలో 13,326 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తున్నాం. పైలెట్ ప్రాజెక్టుగా మొదటగా పిఠాపురం నియోజకవర్గంలో చేపడతాం” అని పవన్ అన్నారు. 164 శాసనసభ స్థానాలు... 21 లోక్ సభ స్థానాలు... 93 శాతం స్ట్రయికింగ్ రేట్ తో ఎన్డీఏ కూటమిని ప్రజలు ఆశీర్వదించారు. వారు మనపై పెట్టుకున్న నమ్మకానికి న్యాయం చేయాల’ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నామని, వ్యవస్థలను బతికించాలనే ఉద్దేశంతోనే అన్నీ తట్టుకొని నిలబడ్డామన్నారు. బలోపేతమైన వ్యవస్థలను గత ప్రభుత్వం ఆటబొమ్మలుగా మార్చిందని చెప్పారు. అత్యుత్తమ పాలనలో ఒకప్పుడు మోడల్ గా ఉన్న రాష్ట్రం... గత ఐదేళ్ల పాలనలో ఎంత దారుణంగా దిగజారిపోయిందో చూశామనీ, గత పాలకుల విధానాల వల్ల పాలన ఎలా ఉండకూడదు అనే విషయానికి రాష్ట్రం మోడల్ గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మన రాష్ట్రంలో పనిచేయడానికి పోటీ పడేవారని, మళ్లీ అలాంటి పరిస్థితి తీసుకొద్దామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, పాలన దక్షతతో రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొద్దామని పిలుపునిచ్చారు. రాజ్యాంగం ఎంత గొప్పగా ఉన్నా.. దాన్ని అమలు పరిచేవారు సరిగా లేకపోతే ఆ వ్యవస్థ పని చేయదు. బలహీనమైన రాజ్యాంగం ఉన్నా ప్రజల కోసం పని చేసేవారు ఉంటే ఆ వ్యవస్థ కచ్చితంగా పనిచేస్తుందని డాక్టర్ అంబేద్కర్ గారు చెప్పారు. గత ప్రభుత్వంలో వ్యవస్థలను ఎలా చిద్రం చేశారో మనం చూశాం. పాలన అనుభవం ఉన్న వ్యక్తి శ్రీ చంద్రబాబు నాయుడు గారు, నేర్చుకోవాలనుకునే తపన ఉన్న నాలాంటి వ్యక్తి, పాలన అనుభవం ఉన్న మంత్రి వర్గ సహచరులు కలిసి వ్యవస్థలను ముందుకు తీసుకువెళతాం. శ్రీ చంద్రబాబు నాయుడు గారి విజన్‌ను తాము ముందుకు తీసుకువెళతాం. విభజన ముందు 20 ఏళ్ల పాటు అవమానాలు.. ఇబ్బందులు పడ్డాం అన్నారు.

రాష్ట్ర విభజన నాటి నుంచి ఇప్పటి వరకు మనం నలుగుతూనే ఉన్నాం. గత ప్రభుత్వంలో బోర్డర్ దాటి రాష్ట్రంలోకి రావడానికి కూడా అనుమతించని పరిస్థితి. అన్నింటినీ దాటుకుని ముందుకు వచ్చాం. పరిపాలనలో ఒక అడుగు ముందుకు పడాలి తప్ప వెనక్కి వెళ్ల కూడదు. రాష్ట్ర అభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నాం. 2047లో భారత్ సూపర్ పవర్ కావాలన్నా, వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం పూర్తి కావాలన్నా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సహకారం అవసరం” అన్నారు.

## వైద్య శాఖ పనితీరు మెరుగుపడాలి

- ప్రైవేటు ఆస్పత్రులతో మనమెందుకు పోటీ పడలేం?



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులకు సూచించారు. కలెక్టర్లతో జరిగిన సదస్సులో ఆయన వైద్య ఆరోగ్యశాఖ, ఆస్పత్రుల పనితీరుపై పలు కీలక సూచనలు చేశారు. ఓపెన్ మార్కెట్తో పోటీ పడేందుకు ప్రయత్నించడంతో పాటు ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలని ఆదేశించారు. సామాన్యుడికి మెరుగైన వైద్యం అందుబాటులోకి రావాలని, ఖర్చు చేసిన ప్రతి రూపాయికి తగిన వైద్యం అందాలని సీఎం ఆకాంక్షించారు. కార్పొరేట్ ఆస్పత్రులు లాభాలు ఆశించి మెరుగైన వైద్యం అందిస్తున్నప్పుడు మనం ఏ లాభాపేక్ష లేకపోయినా మెరుగైన వైద్యం ఎందుకు అందించలేకపోతున్నామని అధికారుల్ని ప్రశ్నించారు. ఈ అంశంపై దృష్టి సారించాలని సూచించారు. ఇన్సూరెన్స్ కూడా అందరికీ యూనిఫాంగా పెట్టాలని, ప్రైవేట్ ఆస్పత్రులతో మనం ఎందుకు పోటీపడలేం అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ప్రైవేట్ ఆస్పత్రులతో ప్రభుత్వ ఆస్పత్రులు పోటీపడాలని, దీన్ని ఓ సవాల్గా తీసుకొని యంత్రాంగం పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, వసతులు, విశాలమైన స్థలం అన్నీ ఉన్నాయి గనక ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందించాలని చంద్రబాబు ఆదేశించారు.

## బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రాజీనామా

- దేశాన్ని విడిచి సురక్షిత ప్రాంతానికి...



**( పొలిటికల్ డెస్క్ , జర్నలిస్ట్ ఫైల్ ) :** బంగ్లాదేశ్ లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలతో పరిస్థితి చేజారింది. దాంతో సైన్యం రంగంలో దిగింది. దేశం మొత్తం దాని నియంత్రణలోకి వచ్చింది. ఆర్మీ చీఫ్ వాకర్-ఉజ్-జమాన్ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. త్వరలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నిరసనకారులు హింసామార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. దీనికి ముందు షేక్ హసీనాకు ఆర్మీ అల్టిమేటం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆమె పదవి నుంచి దిగిపోయేందుకు 45 నిమిషాల సమయం ఇచ్చినట్లు పలు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే రాజీనామా చేసి, సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోయినట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. త్రిపుర రాజధాని అగర్తలకు

2లో

# అసంతృప్తిలో ‘అధికార పార్టీ’ నేతలు

**(పొలిటికల్ డెస్క్ , జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉను నామినేటెడ్ పదవుల కోసం టిడిపి కూటమి నేతలు ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా.. ఇప్పటికీ ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. రేపోమాపో అంటూ సాగదీయటంతో కొంతమంది నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల కోసం చూస్తున్న ఆశావహులు తమ బయోడేటాను పార్టీ కార్యాలయంలోని ప్రోగ్రామ్స్ కమిటీకి అందించాలని టిడిపి అధిష్టానం నెలన్నర క్రితం ఆ పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రోగ్రామ్స్ కమిటీ నాయకుల నుంచి బయోడేటా, దరఖాస్తులు స్వీకరిస్తోంది. ప్రోగ్రామ్స్ కమిటీకి వచ్చిన బయోడేటాల పరిశీలన కార్యక్రమం టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోనే జరుగుతోంది. దీంతో ఎవరికి ఏ పదవి వస్తుంది? ఎప్పుడు భర్తీ చేస్తారనే అంశం మిగిలిన నేతలకు తెలియడం లేదు. నామినేటెడ్ పోస్టుల ఖాళీల వివరాలను సాధారణ పరిపాలనశాఖ అన్ని శాఖల నుంచి సమాచారం జులై



మొదటి వారంలో తెప్పించుకుంది. రాష్ట్రంలో పోలీస్ శాఖలోనిడిఎస్పి, సిఐలతోపాటు, ఇతర శాఖల్లో కూడా అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఈ పోస్టులు ఎమ్మెల్యేల ఇష్ట ప్రకారమే జరుగుతున్నాయని, పదవి లేకపోవడంతో తాము ఏమీ చేయలేకపోతున్నామని శనివారం టిడిపి నేత బుద్ధా వెంకను బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బుద్ధా వెంకను వంటి నేతలు పార్టీలో మరికొందరు ఉన్నారని, అయితే వారు బయటపడటం లేదనే చర్చ టిడిపిలో నడుస్తోంది.

**గ్రీవెన్స్‌లో అధికులు ఆశావహులే!**

టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, పార్టీ నేతలు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో నామినేటెడ్ ఆశావహుల దరఖాస్తులే ఎక్కువగా ఉంటున్నాయనే చర్చ టిడిపిలో జరుగుతోంది. గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డ కార్యకర్తలు, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు

2లో

## భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి శ్రీశైలం ఈవో పెద్దిరాజు



**శ్రీశైలం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ సిబ్బందిని ఈవో పెద్దిరాజు ఆదేశించారు. క్షేత్రంలో శ్రావణమాసం ప్రారంభోత్సవాల సందర్భంగా క్షేత్ర పరిధిలో పర్యటించి.. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివిభాగాల సిబ్బంది పరస్పర సమన్వయం ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా భక్తులకు వసతి సౌకర్యం, సులభ దర్శనం, అన్నప్రసాద వితరణతో పాటు క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణను ఆయా విభాగాల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. దర్శన ఏర్పాట్లకు సంబంధించిన సమాచారాన్ని ప్రసార వ్యవస్థ ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, బిస్కెట్స్, అల్పాహారం అందించాలని చెప్పారు. క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, అన్నప్రసాద వితరణ కేంద్రాల వద్ద ఎటువంటి తోపులాటలు జరుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్నప్రసాదం కోసం వచ్చే భక్తులు ఎక్కువ సమయం నిరీక్షించకుండా ఉండేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు అన్నదాన భవనంలోని భోజనశాలలో తగు ముందస్తు ఏర్పాట్లు ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. భవనంలో వండిన ప్రతి వంటకం భక్తులందరికీ చేరేలా నిత్యం పర్యవేక్షించాలన్నారు. క్షేత్ర పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని భద్రతా విభాగం పర్యవేక్షకులను ఆదేశించారు. ఈ విషయంలో పోలీసుశాఖ సహాయ సహకారాలను తీసుకోవాలని చెప్పారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు హర్షణీయం



○ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సోమవారం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జరిగిన కలెక్టర్, ఎస్పీల సమీక్షా సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ... అధికారం ఉందని పెత్తందారులుగా ప్రవర్తించకుండా.. సహ ఉద్యోగులతో పని చేయించుకోవాలని, వారిని అవమానించేలా మాట్లాడొద్దని.. సమస్యలను కేవలం రూల్ పొజిషన్ లో మాత్రమే చూడకుండా మానవతా దృక్పథం కోణంలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని .. వ్యాఖ్యలు చేయడం పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ...ఈ వ్యాఖ్యలు ముఖ్యమంత్రి గారికి క్రింది స్థాయి ఉద్యోగుల ఆత్మాభిమానం పట్ల వారికున్న గౌరవాన్ని సూచిస్తున్నాయని అని పేర్కొన్నారు. .

## ఇసుక అక్రమాలపై సిఐడి విచారణకు సిఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వంలోని ఇసుక అక్రమాలపై సిఐడి విచారణకు ఆదేశిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో సిఎం మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం, తాగునీటి విషయాల్లో కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన ఇసుక అక్రమాల పై సిఐడి ఎంక్వైరీ వేస్తామన్నారు. ఉచిత ఇసుక విధానం అమలులో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అక్రమాలు జరిగితే సహించనని హెచ్చరించారు. ఇసుక అక్రమాలను చూస్తూ ఊరుకున్న కలెక్టర్లకు కాల్ బ్యాక్ చేస్తానని తెలిపారు. ఇసుక రవాణా ఛార్జీల్లో సమస్యలు వస్తున్నాయన్నారు. ఇసుక వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరించొద్దు అని కలెక్టర్లకు హెచ్చరించారు. ఇసుక సరఫరాలో పూర్తి పారదర్శకత



పాటించాలని ఆదేశాలిచ్చారు. ఇసుక సరఫరాలో ప్రతి స్టెప్ ను డిజిటలైజేషన్ చేస్తామన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామన్నారు. ఇటీవల హంద్రీనీవా కాల్వలకు నీటి విడుదల విషయంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహించారని గుర్తు చేశారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి ఇన్ ఫ్లోస్ పై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. అవసరమైతే డ్రోన్లు వాడాలని చంద్రబాబు సూచించారు. ఈ కలెక్టర్ల సదస్సులో జలవనరుల శాఖపై ప్రిన్సిపల్ సెక్రటరీ సాయి ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ఇప్పుడు అందుబాటులో ఉన్న నీటిని స్టోర్ చేసుకోవాలని సాయిప్రసాద్ సూచనలు చేశారు.

అవసరమైతే మంత్రి నిమ్మలతో అందుబాటులో ఉండాలని కలెక్టర్లకు సాయిప్రసాద్ సూచించారు.

## సిపిఎస్ ఉద్యోగులకు నగదుగా చెల్లించాల్సిన డి.ఏ. ఎరియర్స్ ను వెంటనే చెల్లించాలి

○జూన్ లో వెలువడిన హైకోర్టు తీర్పు ను రాష్ట్రంలో ఉన్న సిపిఎస్ ఉద్యోగులందరికీ వర్తింపచేయాలి.

○ప్రభుత్వానికి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏ.ఎరియర్స్ 2018 నుండి పెండింగ్లో ఉన్నాయని ,దీనిపై సెక్రటేరియట్ సిపిఎస్ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించగా నాలుగు వారాల్లోగా డీఏ ఎరియర్ లను సంబంధిత ఉద్యోగులకు చెల్లించాలని తీర్పు వచ్చిందని... దీని దృష్ట్యా రాష్ట్రంలో ఉన్న సిపిఎస్ ఉద్యోగులందరికీ 90 శాతం నగదుగా రావాల్సిన డిఏ ఎరియర్స్ను వెంటనే చెల్లించేలా తగు ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే సి ఎఫ్ ఎం ఎస్ నంబర్లు ఎలాటైనా డిఏలకు నగదును ట్రెజరీ శాఖవెంటనే చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని మిగిలిన ఎరియర్స్ ను నిర్ణీత గడువులోగా చెల్లించాలా చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో సిపిఎస్ ఉద్యోగులు అటు పెన్షన్ రాక ఇటు కేంద్ర ప్రభుత్వం పెంచిన మ్యాచింగ్ గ్రాంట్ 14 శాతం పెంచక తీవ్రంగా నష్టపోతున్నారని, 2018 నుండి నగదు రూపంలో దాదాపు ప్రతి సిపిఎస్ ఉద్యోగికి రెండు లక్షల పైనే ప్రభుత్వం బకాయి పడిన విషయాన్ని గమనంలోకి తీసుకొని తక్షణ ఉపశమనం కింద డి.ఏ.ఎరియర్లను వెంటనే చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## టీడీపీ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర



**గుంటూరు, పెదకాకాని ( జర్నలిస్ట్ ఫైల్ ):-**పెదకాకాని గ్రామం తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పోసాని నాగేశ్వరావు ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకొని హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చారు. . విషయం తెలుసుకున్న పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సోమవారం ఆయన స్వగృహానికి విచ్చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా

○శిశు మరణాలను నియంత్రించేది తల్లిపాలే

○తల్లిపాలలో 400 రకాల పోషకాలు

**ఆళ్లగడ్డ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా, పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు కీలకంఅని అంగన్వాడి టీచర్ సుశీలమ్మ ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని 19 వ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త సుశీలమ్మ మరియు ఆరోగ్య సిబ్బందితో కలిసి తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15,17,వ అంగన్వాడి కార్యకర్తలు అల్లూరి విజయ, అరుణాలు పాల్గొన్నారు, ఈ సందర్భంగా గర్భిణీలు బాలింతలకు, తల్లిపాల వారోత్సవాల్లో



భాగంగా తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. ముర్రుపాలలో పసుపుపచ్చని కులస్త్రం (కొలెస్ట్రాల్) అనే పదార్థం ఉంటుంది. ఇది గుండె రక్త ప్రసరణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. శిశువుల రోగ నిరోధక శక్తిని పెంచి బిడ్డ ఎదుగుదలకు దోహసం చేస్తుంది. లవణాలు ఖనిజాలు మాంసకృతులు విటమిన్లు తల్లి పాలలో సమృద్ధిగా ఉంటాయి. శిశువుకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము, గర్భసంచి, అండాశయము మొదలగు క్యాన్సర్లు రావని వైద్య నిపుణులు చెప్తున్నారు కావున బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి మొదటి టీకా తల్లిపాలేనని వారు గర్భవతులు బాలింతలకు అవగాహన కల్పించారు .

ఈ కార్యక్రమంలో బాలింతలు గర్భవతులు ఆయాలు, ఆరోగ్య సిబ్బంది ,ఏఎన్ఎం ,ఆశ వర్కర్ ఉన్నారు

## అసంతృప్తిలో 'అధికార పార్టీ' నేతలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజావేదిక పేరుతో ఈ గ్రీవెన్స్ కార్యక్రమం మొదలుపెట్టారు. సమస్యలు చెప్పుకునేందుకు ఎంతమంది వస్తున్నారో అంతే సంఖ్యలో పదవుల కోసమూ వస్తున్నారు. దీంతో గ్రీవెన్స్ కోసం వస్తును వారితో పార్టీ కార్యాలయం కిక్కిరిసిపోతుందని నేతలు భావిస్తున్నారు. ప్రతి శనివారం ముఖ్యమంత్రి వచ్చే సమయంలో వస్తున్న ప్రజలను భద్రతా సిబ్బంది నియంత్రించలేకపోతోంది. ముఖ్యమంత్రి కూడా గంటల తరబడి నిలబడే వారి నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ జరిగితే పార్టీ కార్యాలయానికి వచ్చే నేతలు, ప్రజలు తగ్గుతారని నేతలు భావిస్తున్నారు.

**సీనియర్ల చూపు 'నామినేటెడ్'వై పే..**

టిడిపిలో సీనియర్ నేతలు సైతం కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టులను ఆశిస్తున్నారు. ఎన్నికల సమయంలో పొత్తులో భాగంగా టికెట్లు త్యాగం చేసిన నేతలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల కోసం సీటు త్యాగం చేసిన నేతలు ఈ విభాగంలో ఉన్నారు. సాధారణంగా వీరు ఎమ్మెల్సీ, రాజ్యసభ వంటి పదవులు ఆశిస్తారు. ఈ రెండు కూడా రెండేళ్ల వరకు భర్తీ అయ్యే అవకాశం లేదు. శాసనమండలిలో వచ్చే ఏడాది కేవలం నాలుగు స్థానాలు మాత్రమే ఖాళీ కానున్నాయి. వీటిల్లో టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడుతోపాటు చిక్కాల రామచంద్రరావు, బిటి నాయుడు, పి అశోక్ బాబు ఉన్నారు. 2027లో భారీ సంఖ్యలో భర్తీ కానున్నాయి. రాజ్యసభ స్థానాలు 2026లో నాలుగు ఖాళీ కానున్నాయి. పదవులు లేకుండా అప్పటి వరకు ఉండటం నేతలు కష్టంగా భావిస్తున్నారు. కావున ముందు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి తీసుకుని ఆ తర్వాత ఎమ్మెల్సీ అడగాలని భావిస్తున్నారు.

## బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

హసీనా చేరుకున్నారని తెలుస్తుంది. అక్కడి నుంచి లండన్ కు వెళ్లనున్నారని సమాచారం. "మేం తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. నిరసనల వల్ల ఈ దేశం ఆర్థికంగా ఎంతో నష్టపోయింది. ఎన్నో ప్రాణాలు పోయాయి. ఈ హింసను ఆపాల్సిన సమయం ఇది. నా ప్రసంగం తర్వాత పరిస్థితి మెరుగుపడుతుందని ఆశిస్తున్నాను. పరిస్థితుల్లో మార్పు వస్తే.. అత్యయిక స్థితి అవసరం ఉండదు" అని ఆర్మీ చీఫ్ టీవీ ప్రసంగంలో విజ్ఞప్తి చేశారు. అప్పుడే హసీనా రాజీనామా చేసిన విషయాన్ని వెల్లడించారు.

ఈ పరిణామాల వేళ.. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీద్ వాజెద్ జాయ్ ఫేస్బుక్ లో పోస్టు పెట్టారు. అధికారాన్ని చేజిక్కించుకోవాలని యత్నించే ప్రతి ఒక్కరిని అడ్డుకోవాలని సైన్యాన్ని కోరారు. "ప్రజలను, ఈ దేశాన్ని సురక్షితంగా ఉంచడం మీ బాధ్యత. ఎన్నిక కాని ప్రభుత్వం అధికారంలో కూర్చోవడానికి ఒక్క నిమిషం కూడా అనుమతించొద్దు. ప్రధానిని గద్దె దించితే మన సాధించిన అభివృద్ధి అంతా మట్టిలో పోసినట్టవుతుంది. తిరిగిమళ్లీ పుంజుకోలేదు. మనం అలాంటి పరిస్థితిని కోరుకోం" అని ఫేస్బుక్ లో పోస్టు పెట్టారు. ఆయన ప్రధానికి ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అడ్వైజర్గా పనిచేస్తున్నారు.

# అభివృద్ధే లక్ష్యంగా..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఏ మున్సిపాల్టీలో కూడా చెత్త కనపడటానికి వీల్లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధుల పట్ల శ్రద్ధ కనబరచాలన్నారు. క్రమం తప్పకుండా నీటి పరీక్షలు నిర్వహించడంతో పాటు దోమల బెడద నివారించడానికి డ్రోన్ సహకారం తీసుకోవాలని సూచించాలి. రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు స్వయం సమృద్ధితో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు ఇచ్చిన విరాళాలతో రూ.వెయ్యి కోట్ల కార్పస్ ఫండ్స్ ఏర్పాటు చేసి టీటీడీ నిత్యాన్నదానం కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు.

**స్వచ్ఛ భారత్ యూసీ సర్టిఫికెట్లు ఇవ్వండి**

స్వచ్ఛ భారత్ నిర్వహణలో ఒకప్పుడు మనం ముందున్నామని గత ఐదేళ్లలో ఈ పథకం కింద రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులు ఏమయ్యాయో కూడా తెలీని పరిస్థితి నెలకొందన్నారు. ఢిల్లీకి వెళితే కేంద్రం చేసే ప్రధాన ఫిర్యాదు ఏంటంటే స్వచ్ఛ భారత్కు మేం ఇచ్చిన డబ్బులకు ఇప్పటి వరకు యుటిలైజేషన్ సర్టిఫికేట్ ఇవ్వలేదు అంటున్నారని, జిల్లా కలెక్టర్లు వెంటనే ఈ యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇచ్చేలా తమ తమ జిల్లాలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద సృష్టించవచ్చని తాను ఏనాడో చెప్పానని, ఇప్పుడు ఎన్నో ప్రైవేటు సంస్థలు చెత్తను విద్యుత్తుగా మార్చి మనకు డబ్బులు చెల్లించడానికి ముందుకొస్తున్నాయని దాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. అన్ని మున్సిపాల్టీల్లో చెత్త సేకరించి, దాని నుంచి విద్యుత్తు తయారీ దిశగా అడుగులు వేయాలన్నారు. దీనికోసం గతంలో తాము ప్రవేశపెట్టిన పద్ధతులను పునరుద్ధరించాలని సూచించారు.

**అన్నా క్యాంటీన్లకు టీటీడీ నిత్యాన్నదానం తరహాలో ఒక కార్పస్ ఫండ్ ఏర్పాటు**

అన్నా క్యాంటీన్లు కూడా దాతల నుంచి విరాళాలు సేకరించి స్వయం సమృద్ధి సాధించి నిర్వహణ జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. దాతలకు స్ఫూర్తి కలిగించేలా ఈ కార్యక్రమాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళ్లితే బాగుంటుందో వినూత్న ఆలోచనలతో అధికారులు ముందుకు రావాలని కోరారు.

**గత ప్రభుత్వం నిలిపేసిన ఆదరణ పనిముట్లు సత్వరమే పంపిణీ చేయాలి**

బీసీల్లో వారసత్వంగా వచ్చే వృత్తులను ప్రోత్సహించడానికి గతంలో ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించాం. కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా పనిముట్లు లబ్ధిదారులకు అందించకుండా పక్కనబెట్టింది. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు చిత్తూరు, అల్లూరి సీతారామరాజు మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో పనిముట్లు పంపిణీ చేయలేదు. వాటిని వెంటనే లబ్ధిదారులకు అందించాలి. 2014-19 మధ్య పలు చోట్ల బీసీ భవనాలు నిర్మించతలపెట్టాం. వాటిని కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదు...సాధ్యమైనంత త్వరగా ఆ బీసీ భవనాలు పూర్తి చేయాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సామాజిక న్యాయం జరగాలి. మొన్నటి ఎన్నికల్లో మేము కూడా సోషల్ రీ ఇంజనీరింగ్ నిర్వహించాం. చట్ట సభల్లోకి రాని కులాలు ఇంకా ఉన్నాయి. మేము చేపట్టిన సోషల్ రీ ఇంజనీరింగ్ వల్ల రజిక సామాజిక వర్గానికి చెందిన వారిని మొదటి సారి అసెంబ్లీకి తీసుకొచ్చాం అన్నారు.

**అమరావతిలో పీపీపీ విభాగం**

రహదారుల నిర్వహణ పీపీపీ విధానంలో ప్రవేటు సంస్థలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దీనివల్ల ఆ రహదారిని వారు సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా రోడ్డు మీద గుంతలు పడినా ఎప్పటికప్పుడు ఆ గుంతలను పూడ్చి మరమ్మతులు చేస్తారన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్కు ఆకాశమే హద్దు అన్నారు. అమరావతిలో ప్రత్యేకించి ఒక పీపీపీ విభాగం ఏర్పాటు చేస్తున్నామని, జిల్లాల్లో పీపీపీ మోడల్ లో ఏదైనా పని చేయాలంటే ఈ విభాగాన్ని సంప్రదించి వారి నుంచి సలహాలు సూచనలు కూడా పొందవచ్చని తెలిపారు. పేదలకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని ఎన్నికల్లో మాటిచ్చామని ఆ దిశగా ఈ ఆరోగ్య బీమా నిర్వహణ దేశంలోనే అత్యంత బెస్ట్ మోడల్ గా ఉండాలన్నారు. నాడు తాము వైద్య రంగంలో పీపీపీ మోడల్ లో చేపట్టిన చర్యలోభాగంగా మెడ్ టెక్ ఏర్పాటు చేస్తే అది ఇప్పుడు దేశంలోనే నెంబర్ వన్గా ఉందన్నారు. అధికారులందరూ వినూత్న ఆలోచనలతో పనిచేయాలని సంక్షోభం అనేది ఒక అవకాశమన్నారు.

**రేషన్ బియ్యం డోర్ డెలివరీ పేరుతో అక్రమాలు**

వైసీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యం డోర్ డెలివరీ పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. వైసీపీ నేత ద్వారంపూడి కుటుంబం రేషన్ బియ్యం అక్రమాలపై కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రూ.1800 కోట్లు ప్రభుత్వంతో ఖర్చు పెట్టించి మరీ అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. రేషన్ బియ్యం డోర్ డెలివరీ వాహనాల్లోనే బియ్యం రీ-సైక్లింగ్ చేశారని చెప్పారు. ఒకే కుటుంబంలోని ముగ్గురు పదవులు తెచ్చుకుని.. రేషన్ బియ్యం మాఫియాకు పాల్పడ్డారని ఆరోపించారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేయాల్సి ఉంటుందని చెప్పారు.

**పోర్టుల నిర్మాణంపై గ్యారెంటీలు ఎలా ఇవ్వగలం..**

పోర్టుల నిర్మాణం విషయంలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడుతూ... గత ప్రభుత్వం పోర్టుల నిర్మాణాన్ని ఈపీసీ పద్దతుల్లో చేపట్టిందని తెలిపారు. పోర్టులు నిర్మించే కంపెనీలకు ప్రభుత్వం గ్యారెంటీలు ఎక్కడ ఇవ్వగలదని ప్రశ్నించారు. కానీ పోర్టుల్లో జరుగుతున్న నిర్మాణ పనులను ఆపలేమన్నారు. కాంట్రాక్టర్లను తప్పుచేసి పనులు ఆపేయడం ఈ ప్రభుత్వ విధానం కాదని సీఎం స్పష్టం చేశారు. ఏపీలో ఈవీ వెహికల్స్ను ప్రోత్సహించాలని సూచించారు. ఈవీ వాహనాలకు ఛార్జింగ్ కోసం పెద్ద ఎత్తున ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈవీ స్టేషన్ల ఏర్పాటుపై ప్రణాళికలను సీఎంకు సబ్మిట్ చేస్తానని విజయానంద్ చెప్పగా... తనకేం సబ్మిట్ చేయనక్కర్లేదని... ఇంప్లిమెంట్ చేయండని సీఎం ఆదేశించారు.

**ఉన్నత విద్య పై..**

అలాగే పాఠశాల, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై కలెక్టర్ల సదస్సులో చర్చ జరిగింది. ఆ శాఖ కార్యదర్శులు కోనశశిధర్, సౌరభ్ గౌర్ ఉన్నత విద్యపై సదస్సులో వివరించారు. ఏపీ యువతకు గ్లోబల్ స్థాయి ఉద్యోగాలు లభించేలా నైపుణ్యాభివృద్ధి పెంచాలని సీఎం సూచించారు. గతంలో నాక్ అక్రెడిషన్లో ఏపీ యూనివర్సిటీలు టాప్ 10లో ఉండేవని.. ఇప్పుడు నాక్ అక్రిడేషనులో ఒక్కటి కూడా లేకపోవటం శోచనీయమన్నీరు. పాఠ్యాంశాలు కూడా ఎప్పటికప్పుడు మారుతూ ఉండాలన్నిరు. దానిపై కూడా ఎవరికీ ఫోకస్ లేకుండా పోయిందన్నిరు. మన విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో నైపుణ్యాల్ని సంపాదించుకునేలా శిక్షణ ఇవ్వాలన్నారు. అందుకు అనుగుణంగా ఉండే కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. వర్చువల్ వర్కింగ్ కోసం ఓ విధానాన్ని రూపోందించాలని.. దీనిపై ఓ వర్క్ షాప్ చేయాలన్నారు. ఏపీ వర్చువల్ వర్కింగ్ హబ్గా మారాలన్నదే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

**విద్యాశాఖపై ప్రెజెంటేషన్..**

కలెక్టర్ల సదస్సులో విద్యాశాఖపై ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. పోస్ట్ లంచ్ సమావేశం కాబట్టి వీలైనంత త్వరగా ముగిస్తానని కోనశశిధర్ అనగా.. ఎవ్వరికీ నిద్ర రాకుండా ప్రజెంటేషన్ ఇవ్వాలని సీఎం చమత్కరించారు. అనంతరం బడిబాట కార్యక్రమాన్ని కోన శశిధర్ వివరించారు. ఏ స్కూల్ అయినా సరే.. పిల్లలు స్కూళ్లకు వచ్చేలా చూడాలని చంద్రబాబు తెలిపారు. పిల్లలు ఎవ్వరూ డ్రాపవుట్ కావడానికి వీలులేదన్నారు. డ్రాపవుట్లు ఉండకుండా కసరత్తు చేస్తామన్న మంత్రి నారా లోకేష్ తెలిపారు. అన్ని రకాల పాఠశాలలు సీబీఎస్సీ పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

**ఆకస్మిక తనిఖీలు చేద్దాం...**

ఏపీ విజన్ డాక్యుమెంట్ను అక్టోబర్ 2న విడుదల చేస్తామని, కలెక్టర్లు ఆఫీసులో మాత్రమే కాకుండా ఫీల్డ్ విజిట్ కూడా చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో అందరూ తెలుసుకోవాలన్నారు. గ్రామంలోకి వెళితే పెద్దపెద్ద సభలు వద్దని, తాను కూడా త్వరలో ఆకస్మిక తనిఖీలు చేస్తానని చెప్పారు.

హైదరాబాద్ను అభివృద్ధిని చేసింది ఆఫీసర్లేనని.. ప్రజలు మమ్మల్ని ఎన్నుకున్నారు కాబట్టి మేము మీతో పనిచేయించాలి.. మేమే పనిచేయాలి అంటే కుదరదని సీఎం చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు డ్రైన్లలో ఐఏఎస్ ఆఫీసర్లను దించిన రోజులు కూడా ఉన్నాయన్నారు. తరువాత అంత కఠినంగా తాము పోలేదు... హైదరాబాద్ను కూడా మీరే బిల్డ్ చేశారని.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పినట్టు కనీస అవసరాలు అందరికి అందిచే విషయంలో ఓ క్లారిటీ రావాలన్నారు. వేస్ట్ ఎనర్జీ ప్లాంటులు తెస్తే రెండు అందుబాటులోకి వచ్చాయని అయితే వాటిని డిస్మాంటిల్ చేశారన్నారు. హెడ్ క్వార్టర్కు రోడ్లు, కనెక్టివిటీ, పోర్టుల వృద్ధి చేయాలని, వాటితోపాటు టూరిజానికి కూడా ప్రయారిటీ ఇవ్వాలని సూచించారు.

ఎంత పెట్టుబడి పెట్టామనేదానికంటే ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయన్నదే ముఖ్యమని, డెమోగ్రాఫిక్స్ మేనేజ్మెంట్ చేయడం ఎంతో అవసరమని సీఎం చంద్రబాబు అన్నారు. లింకింగ్ ఆఫ్ రివర్స్ అనేది మన రాష్ట్రంలో అయినా చేయగలగాలని.. అప్పుడు కరవు రహిత రాష్ట్రాన్ని చూడగలుగుతామని అన్నారు. స్కిల్ సెన్సెస్ ఇదికోర్ ప్రోగ్రాం లాస్ట్కు వచ్చేసరికి జిల్లా, మండల లెవల్ జీఎస్డీపీ కూడా తీస్తామని, వర్క్ హర్డ్, వర్క్ స్మార్ట్ , థింక్ గ్లోబల్లీ ఉండాలని, కలెక్టర్లు అందరికి చెపుతున్నామని, వారి కేరియర్ బాగుండాలి.. వారు ఎంత చేస్తే అంత ఎంకరేజ్ చేస్తాం... ఆల్ ది బెస్ట్ టూ కలెక్టర్స్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

# పేదవాడికి న్యాయం జరిగేలా ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ చట్ట సవరణ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కఠినమైన నియమ నిబంధనలు, జరిమానాలను రూపొందించడం జరిగిందన్నారు. పేద వాడికి ఎటు వంటి అన్యాయం జరుగకుండా ఉండేందుకై వాటి కంటే మరింత కఠినమైన నియమ నిబంధనలు, జరిమానాలతో ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టును ను సవరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో దాదాపు తొమ్మిది లక్షల ఎకరాల ఎస్సైన్డు భూములను ఫ్రీ హోల్డుగా మార్చడమే కాకుండా దాదాపు 25 వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోవడం జరిగిందన్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్లు అంతా ప్రత్యేక దృష్టి సారించి సామాన్య మానవుడికి న్యాయం జరిగే విధంగా ఈ వ్యవస్థను గాడిలో పెట్టాలని ఆయన కోరారు.

ముఖ్యమంత్రి తో పాటు పలువురు మంత్రుల వద్దకు వచ్చే విజ్ఞప్తుల్లో 80 శాతం పైగా రెవిన్యూకు సంబందించినవే అన్నారు. ప్రజల హక్కులను కాపాడే విధంగా రెవిన్యూ శాఖను ప్రక్షాళన చేయాలని, అధికారుల అంతా చట్టానికి లోబడి పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కోరుకుంటున్నారన్నారు. గత పాలకులు చేసిన అరాచకాలు బయట పడకుండా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లను ధగ్దం చేయడం జరిగిందన్నారు. మదనపల్లి వెళ్లిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాకు కుప్పలు తెప్పలుగా విజ్ఞాపనలు రావడమే గత ప్రభుత్వం చేసిన కుంభకోణాలకు నిదర్శనం అన్నారు.

గత ముఖ్యమంత్రి ఫొటోల పిచ్చితో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ పాస్ పుస్తకాలపై తమ పొటోలను ముద్రించుకోవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన రీ-సర్వేను కొనసాగించినా, నిలుపుదల చేసినా సమస్యలు ఎన్నో ఎదురవుతున్నాయని, ఈ విషయంలో గ్రామ సదస్సుల నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు జిల్లా కలెక్టర్లు అంతా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో 77 లక్షల సరిహద్దుల రాళ్లు ఉన్నాయని, వాటిని కూడా సద్వినియోగం చేసుకునే విధంగా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆయన కోరారు.

గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసే విధంగా పనిచేయడమే కాకుండా వారి పాలనలో ఒకే ఒక సారి ప్రజావేదిలో జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించి, మరుసటి రోజు ఆ వేదికనే కూల్చేసిన ఆ ప్రభుత్వం యొక్క సైకో స్వభావాన్ని ప్రజలు గ్రహించారే గానీ అధికారుల్లో కొందరు గ్రహించలేకపోయారన్నారు. గత ముఖ్యమంత్రి వ్యవస్థను కూల్చేందుకు ప్రయత్నించాడు కాబట్టే ఆ వ్యవస్థలే అతన్ని మింగేశాయన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తదుపరి తొలిసారిగా జిల్లా కలెక్టర్లతో నిర్వహిస్తున్న సమావేశం ఇదని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పొప్పులను అన్నింటినీ సమీక్షించి రాబోయే రోజుల్లో ఒక ప్రజాహితమైన పరిపాలన అందజేసేందుకు అవసరమైన దిశానిర్ధేశాన్ని చేసేందుకు ఈ సమావేశం నిర్వహించడం జరుగుచున్నదన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతు చేపట్టిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఐదు ముఖ్యమైన ఫైళ్లపై సంతకాలు చేయడం జరిగిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశలు కల్పించే విధంగా మెగా డిఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్దరణ, సామాజిక భద్రతా ఫించన్ల పెంపు మరియు స్కిల్ సెన్సెస్ ఫైళ్లపై సంతకాలు చేసి పలు వర్గాల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే విదంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఫించన్ల పంపిణీ విషయంలో కలెక్టర్లు అద్భుతంగా పనిచేసి ఒకటవ తేదీనే 97 శాతం పింఛన్లను అందజేయడం జరిగిందని అభినందించారు.

జిల్లా పరిపాలనా వ్యవహారాల్లో జిల్లా కలెక్టర్లు పట్టుకొమ్మలని, ప్రభుత్వ ఆలోచనా విధానాలను ప్రతిభింబిచే విధంగా క్షేత స్థాయిలో కలెక్టర్లు పనితీరు ఉండాలన్నారు.

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి

జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్ పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం, షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు

ప్రకటనల విభాగం

76 61 80 59 68

## బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింస : 300కి చేరిన మృతుల సంఖ్య



**ఢాకా(జర్నలిస్ట్ ఫైల్) :** స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో హింస చెలరేగింది. వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి గతకొన్నిరోజులుగా ఆందోళనల చేస్తున్నారు. ఆ దేశ ప్రధాని షేక్ హసీనా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నినదిస్తున్నారు. విద్యార్థులను అదుపుచేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. పోలీసులకు విద్యార్థులకు జరిగిన ఘర్షణల్లో కేవలం ఆదివారం ఒక్కరోజే వంద మంది మృతి చెందారని మీడియా వెల్లడించింది. వీరిలో రంగ్‌పూర్ సిటీ కార్పొరేషన్‌కు చెందిన హిందూ కౌన్సిలర్ హరధన్ రారు హర కూడా ఉన్నారు. ఈయన 4వ వార్డు కౌన్సిలర్ అని ది డైలీ స్టార్ దినపత్రిక నివేదించింది. ఇస్కాన్, కాళి దేవాలయాలతోసహా హిందువులకు చెందిన గృహాలు, దేవాలయాల్ని ఆందోళనకారులు లక్ష్యంగా చేసుకున్నట్లు మీడియా నివేదికలు సూచించాయి. కాగా, ఈ హింసాత్మక నిరసనల్లో రంగ్‌పూర్‌కు చెందిన హిందూ కౌన్సిలర్ కాజల్ రారు కూడా మృతి చెందారని న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. అక్కడ పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి కర్ఫ్యూ అమలులో ఉంది. సోమవారం కూడా కర్ఫ్యూ కొనసాగుతుంది. బ్యాంకులతో సహా అన్ని సంస్థలను మూడురోజులపాటు మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆసుపత్రులు, నీరు, గ్యాస్ విద్యుత్ వంటి అవసరమైన సేవలు నిరవధికంగా పనిచేస్తున్నాయి. సోమవారం ఆందోళన కొనసాగనున్న నేపథ్యంలో పోలీసులు ప్రధాని కార్యలయం చుట్టూ భారీగా మోహరించారు. పిఎం కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారులు మూసివేశారు. బారికేడ్లను ఏర్పాటు చేసి పెట్రోలింగ్ నిర్వహించారు.

బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో భారతీయులు ఆ దేశానికి వెళ్లొద్దని, తదుపరి నోటీసు వచ్చేంతవరకు వెళ్లొద్దని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సూచించింది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో నివశిస్తున్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అత్యవసర పరిస్థితుల్లో ఆ దేశంలోని భారతీయులు 8801958383679, 8801958383680, 8801937400591 ఫోన్ల ద్వారా సంప్రదించాలని భారత విదేశాంగ శాఖ పేర్కొంది.

## కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ ఎల్లుండికి వాయిదా పడింది. ఇప్పటికే కవిత దాఖలు చేసిన పలు బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈ రోజు విచారణ జరిగింది. తదుపరి విచారణను రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరీ భవేజా ఆగస్ట్ 7కు వాయిదా వేశారు. సీనియర్ అడ్వకేట్ అందుబాటులో లేకపోవడంతో కేసును మరో రోజుకు వాయిదా వేయాలని కవిత తరపు న్యాయవాది న్యాయస్థానాన్ని కోరారు. ఈ క్రమంలో తదుపరి విచారణను జడ్జి వాయిదా వేశారు. మరోవైపు తీహార్ జైలులో ఐదు నెలల నుంచి ఉన్న ఎమ్మెల్సీ కవితను రేపు కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు కలవనున్నారు.

## కేజ్రీవాల్‌కి దక్కని ఊరట.. బెయిల్ పిటిషన్‌ని కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కి షాక్ తగిలింది. ఢిల్లీ హైకోర్టులో ఆయన వేసిన బెయిల్ పిటిషన్‌పై విచారించిన ధర్మాసనం పిటిషన్‌ని కొట్టేసింది. దీంతో బెయిల్‌పై ఆశలు పెట్టుకున్న కేజ్రీవాల్‌కి ఊరట దక్కలేదు. ఈ ఘటనను చట్టవిరుద్ధమైన అరెస్టు అని చెప్పలేమని జస్టిస్ నీనా బన్సల్ కృష్ణతో కూడిన ధర్మాసనం పేర్కొంది. బెయిల్ దరఖాస్తు కోసం కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ ఉందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.

**పిటిషన్లో ఏముందంటే..**

లిక్కర్ కేసులో అవినీతి జరిగిందంటూ సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ వేశారు. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, ఎన్ హరిహరన్, రమేష్ గుప్తా వాదనలు వినిపించారు. సీబీఐ తరఫున ఎస్పీపీ సింగ్ హాజరయ్యారు. ఈ పాలసీపై కేజ్రీవాల్‌తోపాటు అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ కూడా సంతకం చేశారని సింఘ్వీ వాదించారు.

మాజీ ఎల్జీ, బ్యూరోక్రాట్‌లను కూడా నిందితులుగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు మొత్తం కుంభకోణంలో కేజ్రీవాల్ ప్రమేయం ఉందని, అందుకు తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని సింగ్ తెలిపారు. అరెస్టు చట్టవిరుద్ధం కాదని ట్రయల్ కోర్టు ఇప్పటికే నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు. కేజ్రీవాల్‌పై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసిందని.. ముఖ్యమంత్రికి బెయిల్‌పై విడుదలయ్యే అర్హత లేదని సింగ్ పేర్కొన్నారు. సహ నిందితులు మనీష్ సిసోదియా, కె కవితపై ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ కోర్టు బెయిల్ నిరాకరించిన విషయాన్ని గుర్తు చేశారు.

'ఇన్సూరెన్స్ అరెస్ట్' అనే పదాన్ని ఉపయోగించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. కేజ్రీవాల్‌కు సీబీఐ ముందస్తు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించకుండానే నేరుగా బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. లిక్కర్ స్కాం కేసుల్లోనే ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ప్రస్తుతం తిహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. మేలో, సాధారణ ఎన్నికల దృష్ట్యా జూన్ 01 వరకు సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న ఆయన తిరిగి లొంగిపోయారు.

## మదురోపై ఒత్తిడి పెంచేందుకు సిద్ధమైన ఇయు



**కారకస్ :** అమెరికా, లాటిన్ అమెరికాలతో పాటు వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచేందుకు యూరోపియన్ యూనియన్ (ఇయు) సిద్ధమైంది. అధ్యక్ష ఎన్నికల్లో మదురో సాధించిన విజయాన్ని గుర్తించేందుకు నిరాకరిస్తున్నట్లు ప్రకటించింది. వెనిజులాకి చెందిన నేషనల్ ఎలక్షన్ కౌన్సిల్ శనివారం ఎన్నికల ఫలితాలను ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ ఫలితాలు గుర్తించబడవని ఇయు కౌన్సిల్ ఓ ప్రకటనలో తెలిపింది. అధికారిక ఓటింగ్ రికార్డుల పూర్తి ప్రచురణను ఆలస్యం చేసే ఏదైనా ప్రయత్నం వారి విశ్వసనీయతపై సందేహాన్ని కలిగిస్తుందని పేర్కొంది. ప్రతిపక్షం ప్రచురించిన ఎలక్టోరల్ ఓటింగ్ రికార్డుల కాపీలను అనేక స్వతంత్ర సంస్థలు సమీక్షించాయని, ప్రతిపక్ష నేత ఎడ్మండ్ గొంజాలెజ్ గణనీయమైన మెజారిటీతో అధ్యక్ష ఎన్నికలలో విజేతగా నిలిచారని సూచిస్తున్నాయని ఇయు ప్రకటన పేర్కొంది. వీలైతే అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందిన స్వతంత్ర సంస్థతో ఎలక్టోరల్ రికార్డులను ధృవీకరణ చేపట్టాలని పేర్కొంది. వివరణాత్మక ఓట్ల లెక్కలను విడుదల చేయాలని ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్‌లతో కూడిన ఇయు దేశాలు కోరుతున్నాయి.

వెనిజులా అధ్యక్ష ఎన్నికలపై ఆడిట్ నిర్వహించాలని ఇప్పటికే అధ్యక్షుడు నికొలస్ మదురో వెనిజులా హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఎన్నికల్లో తాను సాధించిన విజయంపై అమెరికా అనుకూల ప్రతిపక్ష నేతలు నానా యాగీ చేస్తున్న సంగతి తెలిసిందే. న్యాయం కోసం తానే న్యాయస్థానాన్ని ఆశ్రయించానని మదురో వ్యాఖ్యానించారు. తనను కోర్టుకు పిలవాలని, ప్రశ్నించాలని, సత్యాన్ని వివరించాలని కోరారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని అన్నారు.

## వయనాడ్ విషాదానికి కారణమదే.. కేంద్రమంత్రి సంచలన వ్యాఖ్య



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** వయనాడ్ లో కొండచరియలు విరిగిపడి జరిగిన భారీ ఉత్పాతం, ప్రాణనష్టంపై విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ముందస్తు హెచ్చరికలను కేరళ సర్కార్ పట్టించుకోలేదని కేంద్ర అమిత్‌షా ఇటీవల పార్లమెంటులో చేసిన ప్రకటనను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ మరో సంచలన ఆరోపణ చేశారు. వయనాడ్‌లో అక్రమ గనుల తవ్వకాలు, జనవాసాల వల్లే అపార ప్రాణనష్టం జరిగిందని తెలిపారు.

అక్రమ జనావాసాలకు స్థానిక రాజకీయవేత్తల రక్షణ ఉందని, కనీసం టూరిజం పేరుతో సరైన జోన్లను కూడా వాళ్లు ఏర్పాటు చేయలేదని, ఈ ప్రాంతంలో భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి ఆరోపించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 'హైలీ సెన్సిటివ్ ఏరియా' అని తెలిపారు. అటవీ శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ సారథ్యంలో తాము ఇప్పటికే ఒక కమిటీ వేశామని, స్థానిక ప్రభుత్వ యంత్రాగం పరిరక్షణలో అక్కడి అక్రమ జనావాసాలున్నాయని, అక్రమ గనుల తవ్వకాలు జరుగుతున్నాయని భూపేందర్ యాదవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు.

**222కు చేరిన మృతులు**

కాగా, వయనాడ్‌లో గత వారం కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో మరణించిన వారి సంఖ్య 222కు చేరింది. వీరిలో 99 మంది పురుషులు, 88 మంది మహిళలు, 37 మంది పిల్లలు ఉన్నారని సీఎంఓ తాజా గణాంకాలను వెల్లడించింది. వీరిలో 172 మృతదేహాలను బంధువులు గుర్తించారని, వివిధ ప్రాంతాల నుంచి 180 మృతదేహాల విడిభాగాలు లభ్యమయ్యాయని, 161 పోస్టుమార్టంలు పూర్తయ్యాయని తెలిపింది. వయనాడ్, కోజికోడ్, మలప్పురం జిల్లాల్లో 91 మంది చికిత్స పొందుతుండగా, 256 మందిని ఇప్పటికే ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేశారు.

**జాతీయ విపత్తుగా ప్రకటించేందుకు బీజేపీ నిరాకరణ**

వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో సహా వివిధ వర్గాల నుంచి వస్తున్న డిమాండ్‌ను బీజేపీ తోసిపుచ్చింది. కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్ ప్రకారం జాతీయ విపత్తుగా ప్రకటించే అవకాశమే లేదని బీజేపీ తెలిపింది. దీనిపై యూపీఏ ప్రభుత్వ హయాం నుంచి విధానపరమైన నిర్ణయంలో ఎలాంటి మార్పు జరగలేదని తెలిపింది. ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించే ప్రొవిజన్ ఏదీ లేదని 2013 ఆగస్టు 6న అప్పటి హెూం మంత్రి ముల్లపల్లి రామచంద్రన్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పిన విషయాన్ని బీజేపీ సీనియర్ నేత వి.మురళీధరన్ ఫేస్‌బుక్ పేజ్‌లో పోస్ట్ చేశారు.

## జాతీయం/అంతర్జాతీయం

## పార్టీ మారిన ఎమ్మెల్యేపై అనర్హత వేటు తప్పదు : కేటిఆర్



**న్యూఢిల్లీ :** పార్టీ మారిన ఎమ్మెల్యేపై అనర్హత వేటు తప్పదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హెచ్చరించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న కెటిఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు.. న్యాయకోవిదులతో చర్చించారు. అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో బిఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తుందన్నారు. కోర్టు తీర్పు ద్వారా నెల రోజుల్లోనే ఫిరాయింపు నేతల అనర్హత అంశంలో స్పష్టత వస్తుందన్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు తప్పవని.. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతామని అన్నారు. రాజ్యాంగ నిపుణులతో పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశమవుతుందని, బిఆర్ఎస్ తరఫున త్వరలోనే సుప్రీం కోర్టులో కేసు వేస్తామని చెప్పారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్‌కు త్వరలోనే కోర్టుల సహాయంతో సరైన గుణపాఠం చెబుతామని కెటిఆర్ హెచ్చరించారు.

## క్లౌడ్ బరస్ట్.. కొనసాగుతున్న సహాయక చర్యలు



**హిమాచల్‌ప్రదేశ్ (జర్నలిస్ట్ ఫైల్) :** హిమాచల్‌ప్రదేశ్‌లో ఆగస్టు ఒకటో తేదీన క్లౌడ్ బరస్ట్ వల్ల పదుల సంఖ్యలో వరదనీటిలో గల్లంతయ్యారు. వివిధ ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయి. సోమవారం సిమ్లా జిల్లాలోని రాంపూర్ సమీపంలోని సమేజ్ గ్రామంలో రెస్క్యూ ఆపరేషన్స్ కొనసాగుతన్నాయి. ఈ వరద ప్రవాహం కారణంగా జిన్జింగ్ బార్ సమీపంలో మూడవ జాతీయ రహదారిని బ్లాక్ చేసినట్లు లాహువల్ స్పితి పోలీసులు సోమవారం తెలిపారు. వాహన రాకపోకలు కోసం కులు %-% మనాలి జాతీయ రహదారిని తెరిచారు. కాగా, గురువారం ఉదయం సంభవించింది. 50 మందికిపైగా వరదనీటిలో గల్లంతయ్యారు. అయితే గల్లంతైన వారు మృతి చెందారా లేదా అనేదానిపై ఇంకా స్పష్టతలేనది ఆ రాష్ట్ర మంత్రి విక్రమాదిత్య సింగ్ తెలిపారు. ఆగస్టు ఒకటి నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీసులు, హెూంగార్డు జవాన్ల బృందాలు రెస్క్యూ ఆపరేషన్స్ కొనసాగిస్తున్నాయి.

## కోచింగ్ సెంటర్లపై సుప్రీం కోర్టు సీరియస్.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీలో వరద ఉధృతి రావూస్ ఐఏస్ కోచింగ్ సెంటర్‌లో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనను దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. ఢిల్లీలోని ఐఏఎస్ కోచింగ్ సెంటర్లలో భద్రతా ప్రమాణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలంటూ ఢిల్లీ సర్కార్‌తో పాటు కేంద్రానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. రావూస్ కోచింగ్ సెంటర్‌లో డ్రైనేజీ వ్యవస్థ, సరైన భద్రతా చర్యలు లేకపోవడంతో ముగ్గురు విద్యార్థులు మృతి చెందినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనలో కోచింగ్ సెంటర్ ఎండీ అభిషేక్ గుప్తా, కో-ఆర్డినేటర్ దేశ్‌పాల్‌సింగ్‌కు కోర్టు 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

## కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు నిరసన సెగ



**పాట్నా(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌శాఖామంత్రి గిరిరాజ్ సింగ్‌కు నిరసన సెగ తగిలింది. బీహార్‌లోని తన సొంత నియోజకవర్గమైన బెగుసరారులో ఆదివారం స్థానిక దాక్ బంగ్లా రోడ్‌లో ఓ పార్క్ శంకుస్థాపనకు వచ్చిన కేంద్ర మంత్రిని ఏఎన్ఎం కార్యకర్తలు ఘెరావ్ చేశారు. మెరుగైన సదుపాయాలు, వేతనాలు కల్పించాలన్న తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తమ సమస్యలు పరిష్కరించాలని కోరతూ ఏఎన్ఎం కార్యకర్తలు ఆయన కారును చుట్టుముట్టి ఆందోళన చేపట్టారు. అయితే గిరిరాజ్ సింగ్ పట్టించుకోకుండా అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఆయన తన కాన్వారుని దిగి బైక్‌పై ఉడాయించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. తమ డిమాండ్ల వినతి పత్రాన్ని సమర్పించాలనుకుంటే.. కేంద్రమంత్రి పట్టించుకోకుండా దారుణంగా వ్యవహరించారని ఏఎన్ఎం కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణా వార్తలు

## మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా? : కేటీఆర్



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** షాద్‌నగర్‌లో దళిత మహిళపై పోలీసుల దాడిని కేటీఆర్ ఖండించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత మహిళపై ఇంత దాష్టీకమా? అని మండిపడ్డారు. 'ఇదేనా ఇందిరమ్మ పాలన? ఇదేనా ప్రజాపాలన? దొంగతనం ఒప్పుకోవాలంటూ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా?' అని ప్రశ్నించారు. రక్షించాల్సిన పోలీసుల దగ్గరే రక్షణలేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. దాడికి పాల్పడిన పోలీసులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని.. బాధిత మహిళకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## విధుల్లో నిర్లక్ష్యం.. ఏఈ, డీఈకి మంత్రి ఉత్తమ్ హెచ్చరిక



**కోదాడ(జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోదాడలో నీటిపారుదల శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిఫ్ట్ ఇరిగేషన్ల పనితీరుపై పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రైతుల లేవనెత్తిన సమస్యలకు అధికారులు సరైన సమాధానాలు ఇవ్వకపోవడంపై మంత్రి సీరియస్ అయ్యారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఏఈ, డీఈని హెచ్చరించారు. అలాగే, హుజూర్‌నగర్ డీఈ నవీన్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ కొత్త సెంటర్..15వేల మందికి ఉద్యోగాలు!



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రఖ్యాత ఐటీ సంస్థ కాగ్నిజెంట్ తెలంగాణలో భారీ విస్తరణ ప్రణాళికతో ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో దాదాపు 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా సుమారు 10లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త సెంటర్ నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కంపెనీ ప్రతినిధులతో కలిసి సమావేశమయ్యారు. ఈ భేటీలో ఒప్పందం కుదిరింది. గతేడాది సీఎం బృందం దావోస్ పర్యటన సందర్భంలోనే ఈ ఒప్పందానికి పునాదులు పడ్డాయి.

సాంకేతికత, కొత్త ఆవిష్కరణలకు అభివృద్ధి కేంద్రంగా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందుకే కాగ్నిజెంట్ కంపెనీ హైదరాబాద్‌లో తమ కంపెనీ విస్తరణకు మొగ్గు చూపింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా సత్తా చాటుకుంటున్న హైదరాబాద్‌లో తమ కంపెనీ విస్తరించటం సంతోషంగా ఉందని కాగ్నిజెంట్ సీఈవో ఎస్.రవికుమార్ అన్నారు. హైదరాబాద్‌లో నెలకొల్పే కాగ్నిజెంట్ కొత్త సెంటర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ క్లయింట్లకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఐటీ సేవలతో పాటు కన్సల్టింగ్‌లో అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందని రవికుమార్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై ఈ కొత్త సెంటర్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా ఐటీ రంగానికి మరింత అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కాగ్నిజెంట్ కంపెనీ కొత్త సెంటర్ ఏర్పాటుతో ప్రపంచ టెక్నాలజీ కంపెనీలన్నీ హైదరాబాద్‌ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయని అభిప్రాయపడ్డారు. కాగ్నిజెంట్ కంపెనీకి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. కొత్త సెంటర్ ఏర్పాటుతో వేలాది మంది యువతకు ఉద్యోగాలతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం ఉంటుందని సీఎం అన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర టైర్-2 నగరాల్లోనూ ఐటీ సేవలను విస్తరించాలని సీఎం చేసిన సూచనకు కంపెనీ ప్రతినిధులు సానుకూలత వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రముఖ టెక్ కంపెనీలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నాయని, ఇక్కడ కొత్త కేంద్రాన్ని స్థాపించాలనే కాగ్నిజెంట్ నిర్ణయం హైదరాబాద్ వృద్ధికి దోహదపడుతుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## రూ.200ల కోసం గొడవ.. చికిత్స పొందుతూ క్యాబ్ డ్రైవర్ మృతి

**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్) :** రూ.200ల కోసం మొదలైన చిన్న గొడవ ఓ యువకుడి జీవితాన్ని శాశ్వతంగా అంధకారంలోకి నెట్టేసింది. ఒక్కడిపై 20 మంది దాడి చేయడంతో అతడు రెండేళ్లపాటు మంచాన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఉప్పర్ పల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 2022 జులై 31వ తేదీ.. రాత్రి 11 గంటలకు వివేక్‌రెడ్డి అనే వ్యక్తి.. హైదరాబాద్‌లో బీఎన్‌రెడ్డినగర్ నుంచి రాజేంద్రనగర్ సమీపంలోని ఉప్పర్‌పల్లికి క్యాబ్ బుక్ చేసుకున్నాడు. గమ్యం చేరుకున్నాక.. ఛార్జి రూ.900 అయ్యిందని క్యాబ్ డ్రైవర్ వెంకటేష్‌గౌడ్ (27) చెప్పగా.. వివేక్‌రెడ్డి రూ.700 మాత్రమే ఇచ్చాడు. మిగిలిన రూ. 200 కోసం ఇద్దరికీ వాగ్వివాదం మొదలైంది. వివేక్‌రెడ్డి తన స్నేహితులకు ఫోన్ చేసి రప్పించాడు. సుమారు 20 మంది వచ్చి, వెంకటేశ్‌గౌడ్‌ను క్రికెట్ బ్యాట్లు, వికెట్లతో చితకబాది.. బంగారు గొలుసు చోరీ చేయబోయాడంటూ వెంకటేష్‌ను రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. ఆ మర్నాడు ఉదయం 6 గంటలకు వెంకటేష్ పరిస్థితి విషమించడంతో పోలీసులు అప్పుడు ఆసుపత్రికి పంపించారు. అక్కడికి తరలిం చిన కొద్దిసేపటికే బాధితుడు కోమాలోకి వెళ్లాడు. ఆస్పత్రిలో రెండేళ్లుగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## కొత్తగూడెంలో పవర్ స్టేషన్‌లో కూలింగ్ టవర్లు కూల్చివేత



**కొత్తగూడెం (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌లో కూలింగ్ టవర్లను అధికారులు కూల్చివేశారు. జెన్కో అధికారుల పర్యవేక్షణలో ఒకేసారి 8 టవర్లను ఒకేసారి కూల్చేశారు. దేశ చరిత్రలోనే తొలిసారి ఎత్తైన కూలింగ్ టవర్లు కూల్చివేయడం ఇదే మొదటి సారి. టవర్ల కూల్చివేత సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు.

## పరిశ్రమలు పెట్టేందుకు వస్తే యువతను ప్రోత్సహిస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

**మధిర(జర్నలిస్ట్ ఫైల్) :** యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొస్తే రుణాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ఎండపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మధిరలో ఏర్పాటవుతున్న ఇండస్ట్రియల్ పార్కు రాష్ట్రానికి రోల్ మోడల్‌గా ఉండాలి. సమాజంలోని అన్ని వర్గాలనూ ప్రోత్సహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మధిర పట్టణ విస్తరణకు కావాల్సిన బైపాస్ రోడ్లు నిర్మిస్తాం. ఇండస్ట్రియల్ పార్కుకు రూ.44కోట్లు కేటాయించాం. విద్య, వ్యవసాయక, పారిశ్రామిక కేంద్రంగా మధిరను నిలుపుతాం. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, సేవా రంగాలను అభివృద్ధిచేసుకొని సమగ్రాభివృద్ధి సాధించాలి.

# సీఎం కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశం చిత్రమాలిక
























# సీఎం కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశం చిత్రమాలిక





























# 2029లోనూ మాదే అధికారం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**చండీగఢ్ :** ఇప్పుడే కాదు 2029లో కూడా కేంద్రంలో అధికారం ఎన్‌డిఏదే అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఈ విషయాన్ని jరాసిపెట్టుకోవాలని, 2029లో కేంద్రంలో ఉండేది బిజెపి సారథ్యపు కూటమి ప్రభుత్వమే అన్నారు. స్థానికంగా మణిమజ్రా నిరంతర నీటి సరఫరా పథకానికి ఆదివారం ఆయన ప్రారంభోత్సవం జరిపారు. ఆ తరువాత విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వ బలం లేదని, ఎప్పుడైనా కేంద్రంలోని సర్కారు కూలుతుందని ఇండియా కూటమి నేతలు చెప్పడాన్ని అమిత్ షా తిప్పికొట్టారు. ఈ పర్యాయం తుదివరకూ ఉండటమే కాకుండా , తరువాతి ఎన్నికల్లో కూడా తమదే గెలుపు అని అమిత్ షా స్పష్టం చేశారు. విపక్షాలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుకోవచ్చు. అయితే దీనిని తాము పట్టించుకునేది లేదని, కేంద్రంలో తిరిగి నెలకొనేది తమ ప్రభుత్వమే , ప్రధానిగా తిరిగి వచ్చేది మోడీనే అని కేంద్రంలో నెంబరు టూగా చలామణిలో ఉన్న అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు ఈసారి కొద్దిగా ఎక్కువ సీట్లు రాగానే తమకు తాము ఎన్నికల్లో గెలిచామనే భ్రమలో పడ్డారని షా తెలిపారు. మొత్తం ఇండియా కూటమికి దక్కిన సీట్ల కన్నా బిజెపికి ఎక్కువ స్థానాలు వచ్చాయని , దేశంలో అనిశ్చితతను సృష్టించే యత్నాల్లో భాగంగానే ప్రతిపక్షాలు ఈ విధంగా తప్పుడు మాటలకు దిగుతారని విమర్శించారు.

# భాగ్యనగరం.. అభివృద్ధి శరవేగం

- హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఘనంగా క్రెడాయ్ ప్రాపర్టీ షో 2024 ముగింపు
- ఎంఏయుడి ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్



**మన తెలంగాణ/మాదాపూర్ :** అభివృద్ధిలో హైదరాబాద్ నగరం వేగంగా ముందుకు సాగుతుందని ఎంఎ, యుడి, డైరెక్టర్ జనరల్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం దానకిషోర్ అన్నారు. మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 8.47శాతం వృద్ధితో దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటన్నారు. కోట్ల విలువైన ప్రాజెక్టులను సిఎం రేవంత్ మంజూరు చేశారన్నారు. ఎంఎయుడి కోసం 6వంద కోట్లు, ఇది రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపు కంటే చాలా ఎక్కువ అన్నారు. నగరానికి సమగ్ర రవాణా ప్రణాళికతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను, నగరం యొక్క డిజిటలైజేషన్, వేగవంతమైన అభివృద్ధిని నిర్ధారించడానికి, దానిని నిజమైన ప్రపంచ నగరంగా మార్చడానికి సాంకేతికతను అనుసరించడాని కృషి చేయడం జరుగుతుందన్నారు. క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో గృహ కొనుగోలుదారుల కోసం క్రెడిబిలిటి నేపథ్య ప్రాపర్టీ షోలో ఒకటవది అన్నారు. ప్రాపర్టీ షో ప్రజలు కేవలం ఆస్తులను అన్వేషించడమే కాకుండా హైదరాబాద్‌లో ఆస్తిలో పెట్టుబడి పెట్టడం వల్ల వృద్ధి అవకాశాలు, ప్రయోజనాల గురించి కూడా తెలుసుకునే ఆదర్శవంతమైన ప్రదేశం హైదరాబాద్ అన్నారు. ప్రపంచంలోని 65 సంపన్న నగరాల్లో ఒకటిగా హైదరాబాద్ ఉందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న 10వ మిలియనీర్ హాట్‌స్పాట్‌గా ఉందన్నారు. దీంతో నగరంలో లగ్జరీ హౌసింగ్ మార్కెట్‌కు డిమాండ్ పెరిగిందన్నారు. హైదరాబాద్ మార్కెట్‌గా రెసిడెన్షియల్, కమర్షియల్, రిటైల్ ప్రాపర్టీలను ధరల బ్రాకెట్లలో శోషించడంలో చాలా బాగా పని చేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని నడపడానికి 3 రింగ్ నిర్మాణాన్ని అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ దృష్టి ఆర్థిక వృద్ధి ఇంజిన్ ఒఆర్‌ఆర్ వరకు ఉన్న ప్రాంతంగా కోర్ అర్బన్ రీజియన్‌గా నిర్వచించబడింది. ఇది రాష్ట్రంలోని 48.6శాతం జనాభాను కలిగి ఉందన్నారు. ఇది రాష్ట్ర ప్రధాన వృద్ధి ఇంజిన్ బడ్జెట్‌లో 10,000కోట్లు ఈ ప్రాంత అభివృద్ధిని వేగవంతం చేయడానికి సహాయపడతాయన్నారు. ఒఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ప్రాంతంలోని సబ్ అర్బన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే ప్రణాళిక టైర్ 2 నగరాలు పెరుగుతున్న పట్టణాలు, మాన్యుఫ్యాక్చరింగ్ , సిటీ సెంట్రిక్ అగ్రి, వాల్యూ యాడెడ్ జోన్‌లతో సెమీ అర్బన్ ప్రాంతంగా ఉంటుందన్నారు.

## అంతా బాధితులే.. సబ్‌కోటాలెందుకు?

సుప్రీంకోర్టు తీర్పుపై మాయావతి వ్యతిరేకత



**లక్నో :** ఎస్‌సి/ఎస్‌టి కోటా వర్గీకరణ జరగాల్సిందేనని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును బిఎస్‌పి వ్యతిరేకించింది. ఈ తీర్పును తమ పార్టీ అంగీకరించడం లేదని నాయకురాలు మాయావతి ఆదివారం స్పష్టం చేశారు. ఎస్‌సి ఎస్‌టిలు ఒకే విధంగా బాధలు ఎదుర్కొన్నారు. దీనిని సామూహికంగా పరిగణించాల్సి ఉంటుంది. వీరందరికి ఒకే విధమైన న్యాయం అందుబాటులోకి రావల్సి ఉంటుంది. అంతేకానీ వర్గీకరణలు, ఉప వర్గీకరణలు అనుచితం అవుతాయని బిఎస్‌పి నేత స్పందించారు. ఇది నిజంగా చూస్తే ఈ వర్గాలను వేర్వేరుగా చూడటం కిందికి వస్తుందని అభిప్రాయపడ్డారు. ఇటువంటి పరిణామాన్ని తాము అంగీకరించేది లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల ఉపవర్గీకరణ అధికారం రాష్ట్రాలకు ఉంటుందని, ఉప కులాలు సామాజిక పరిణామాల నేపథ్యంలో వెనుకబడి ఉన్నందున వారి అభ్యున్నతికి వీరి విషయంలో ఉపవర్గీకరణ అంశాన్ని రాష్ట్రాలు చేపట్టాల్సి ఉందని ఇటీవలే సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది.

## కళారంగంలో ఆమెది విశిష్ట భూమిక

యామిని మృతిపై మోడీ స్పందన

**న్యూఢిల్లీ :** ప్రముఖ నర్తకి యామిని కృష్ణమూర్తి మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. భరతనాట్యం, కూచిపూడి వంటి కళాత్మక నృత్యరీతులలో రాణించి జీవించిన ఆమె తన జీవితాన్ని కళకు అంకితం చేసిందని మోడీ తమ ప్రకటనలో తెలిపారు. ఆమె భారతీయ శాస్త్రీయ నృత్యానికి చేసిన సేవలు దేశ సాంస్కృతిక కళారంగంపై చెదరని ముద్ర వేశాయని కొనియాడారు. 84 సంవత్సరాల యామిని అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. పలు పురస్కారాల డాక్టర్ యామిని కృష్ణమూర్తి అస్తమయం తనకు బాధ కల్గించిందని తెలిపారు. ఆమె రాబోయే తరాలకు కూడా కళారంగంలో విశేష స్ఫూర్తిని అందిస్తారని వివరించారు. ఆమె కుటుంబ సభ్యులకు , కోట్లాది మంది అభిమానులకు తమ ప్రగాఢ సంతాపం తెలియచేశారు.

## వయనాడ్‌లో మృత్యుహేల బాధాకరం

ప్రధాని మోడీకి చైనా ప్రధాని సంఘీభావం

**బీజింగ్ :** కేరళలో కొండచరియలతో తలెత్తిన భారీ విలయం పట్ల చైనా సంతాపం వ్యక్తం చేసింది. దీనికి సంబంధించి చైనా ప్రధాని లి కియాంగ్ ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోడీకి సంతాప ప్రకటన పంపించారు. కేరళలోని వాయనాడ్‌లో వందలాది మంది చనిపోయిన ఘటన తమకు విచారం కల్గించిందని, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు చైనా ప్రధాని తమ సందేశంలో తెలిపారు. చైనా ప్రభుత్వం తరఫున ప్రధాని నుంచి ఈ సంతాపం వ్యక్తం అయినట్లు ఢిల్లీలోని చైనా రాయబారి ఝూ ఫియిహాంగ్ వెల్లడించారు.

## గవర్నర్లపై కేసులు విచారకరం

జస్టిస్ బీవీ నాగరత్న

**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టులో గవర్నర్ల అంశంపై ప్రస్తుతం నడుస్తున్న కేసులు విచారకరమని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. దేశంలో గవర్నర్ల వ్యవస్థపై ఆమె మాట్లాడుతూ గవర్నర్లు చేయాల్సిన పనులు కాకుండా, చేయకూడని పనులు చేస్తున్నారని, క్రియాశీల పాత్ర పోషించాల్సి వచ్చినప్పుడు నిష్క్రియంగా ఉంటారని ఆమె వ్యాఖ్యానించారు. తాజాగా బెంగళూరులో జరిగిన ఎన్‌ఎల్‌ఎస్‌ఐయు-పిఏసిటి సదస్సులో ఆమె పాల్గొన్నారు. గవర్నర్ల తటస్థత గురించి రాజ్యాంగ సభ చర్చల్లో జి. దుర్గాబాయి చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. పార్టీ రాజకీయాలకు ,వర్గాలకు అతీతంగా గవర్నర్‌ను ఉంచడమే పాలకవర్గం బాధ్యత, పార్టీ వ్యవహారాలకు లోబడి గవర్నర్ వ్యవస్థ ఉండకూడదని పేర్కొన్నారు. ఒక రాష్ట్రానికి సంబంధించిన బిల్లులను ఆమోదించడంలో గవర్నర్లు ఆలస్యం చేస్తున్నారని, నిర్లక్ష్యం వహిస్తున్నారనే వ్యాజ్యాలు కోర్టుల్లో అధికమవుతున్నాయని పేర్కొన్నారు.

## ప్రాణాంతకంగా మారిన చలియార్ నదీజలాలు

**వయనాడ్ :** కేరళలోని మూడు జిల్లాలకు ప్రాణాధారమైన చలియార్ నది నిర్మల జలాలు కొండచరియలు విరిగిపడిన తరువాత ఇప్పుడు ప్రాణాంతకంగా మారాయి. 169 కిమీ పొడవున ప్రవహిస్తున్న ఈ నదీ తీరం ఒడ్డున వయనాడ్, మలప్పురం, కొజికోడ్ జిల్లాల ప్రజలు తరతరాలుగా ఈ నదీ జలాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు వైపరీత్యంతో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలే నదిపై తేలియాడుతున్నాయి. స్థానికులతోపాటు నేవీ, పోలీస్, ఫైర్, ఎన్‌డిఆర్‌ఎఫ్, రిస్క్యూ టీమ్‌లు శనివారం ఈ నది నుంచి మరో మూడు మృతదేహాలను, 13 అవయవ భాగాలను శనివారం వెలికి తీయగలిగారు. ఇప్పటివరకు నది నుంచి 73 మృతదేహాలను, 132 అవయవ భాగాలను సేకరించారు. మొత్తం 205 మృతదేహాలు బయటపడ్డాయి. ఇప్పటివరకు 198 మృతదేహాలకు పోస్ట్‌మార్టమ్ పూర్తయిందని వీటిలో 195 మృతదేహాలను తదుపరి కార్యక్రమాల కోసం వయనాడ్ పంపామని అధికారులు చెప్పారు. చలియార్ నది 40 కిమీ పొడవునా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని మలప్పురానికి చెందిన అధికారి తెలిపారు.

## దిగొస్తున్న కూరగాయల ధరలు

**మన తెలంగాణ/హైదరాబాద్ :** నిన్నటిదాక చుక్కలు చూపించిన కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఆదివారం వివిధ మార్కెట్లలో కిలో టమాటా రూ.25చొప్పున విక్రయాలు జరిగాయి. లోకల్ మార్కెట్లలో మరో రూ.5 అధికంగా విక్రయాలు జరిపారు. కిలో వంకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.50, బెండకాయలు రూ.30, కాకరకాయలు రూ.45, కాలీఫ్లవర్ రూ.20,క్యాబేజి రూ.20, కారెట్ రూ.30, దొండకాయలు రూ.35, బంగాళదుంపలు రూ.35, క్లస్టర్‌బీన్స్ రూ.35, దోసకాయ రూ.15, సీసాపొట్లకాయ రూ12, పొట్లకాయ రూ.10చొప్పున విక్రయాలు జరిపారు. కందగడ్డ కిలో రూ.45, బీట్‌రూట్ రూ.25, చొప్పున విక్రయాలు జరిపారు. ఉల్లిగడ్డ ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. కిలో ఉల్లిగడ్డలు రూ.25చొప్పున విక్రయాలు జరిపారు.

# మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తత

- ప్రాంతీయ యుద్ధంపై భయాందోళనలు
- ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా దాడి
- హెజ్బొల్లా రాకెట్లను అడ్డుకున్న ఇజ్రాయెల్
- వెనుకకు తగ్గాలని ఇరాన్‌ను కోరిన బైడెన్





**టెల్ అవీవ్ :** మధ్య ప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకొంటున్న నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా ఇజ్రాయెల్‌పై తాము డజన్ల కొద్దీ రాకెట్లు ప్రయోగించినట్లు హెజ్బొల్లా శనివారం (స్థానిక కాలమానం ప్రకారం) వెల్లడించింది. ఈ వారారంభంలో టెహ్రాన్‌లో హమాస్ రాజకీయ అధినేత ఇస్మాయిల్ హనియెహ్ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికి ఇరాన్, దాని మిత్ర పక్షాలు సన్నద్ధం అవుతున్నాయి. ఆ ప్రాంతంలో యుద్ధం గురించిన భయాందోళనలు వ్యక్తం అవుతుండగా, ఇజ్రాయెల్‌పై దాడి చేస్తామని ఇరాన్ హెచ్చరించినప్పటికీ 'వెనుకకు తగ్గుతుందన్న' ఆశాభావాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యక్తం చేశారు. హమాస్ మాదిరిగా ఇరాన్ దన్ను ఉన్న హెజ్బొల్లా ఇజ్రాయెల్‌లోని మొషావ్ బీట్ హిల్లెల్‌పై తమ రాకెట్ దాడుల్లో పౌరులు గాయపడినట్లుగా వెల్లడించిందని 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' తెలియజేసింది. లెబనాన్‌లో కఫార్ కెలా, డైర్ సిరాయనెపై ఇజ్రాయెల్ దాడులకు, బీరూట్‌లో ఇజ్రాయెలీ దాడిలో ఫువద్ షుకర్ మృతి తరువాత తాము జరిపిన ప్రతీకార దాడి అది అని కూడా హెజ్బొల్లా సీనియర్ మిలిటరీ కమాండర్ చెప్పారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ సోమవారం తెల్లవారు జామున దాడి చేయవచ్చునని తాము భావిస్తున్నట్లు యుఎస్, ఇజ్రాయెలీ అధికారులు ముగ్గురు చెప్పినట్లు 'ఏక్సియస్' తెలియజేసింది. హెజ్బొల్లా ప్రయోగించిన చాలా రాకెట్లను తమ ప్రసిద్ధ డోమ్ వ్యవస్థ అడ్డుకున్నదని ఇజ్రాయెల్ వెల్లడించింది. బీట్ హిల్లెల్ సమీపాన దాడుల ప్రభావం కనిపించిందని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. స్థానిక మీడియా ప్రకారం, ఆ ప్రాంతంలో అగ్ని జ్వాలలు కూడా రేగాయి. మరొక వైపు తమ సిబ్బంది పరిరక్షణ కోసం మధ్య ప్రాచ్యంలో తమ సైనిక ఉనికిని పెంచుతున్నామని, ఆ యూదు దేశానికి అండగా నిలుస్తామని యుఎస్ తెలియజేసింది. ఆ ప్రాంతంలో యుద్ధ భయం నేపథ్యంలో వెంటనే లెబనాన్‌ను వీడవలసిందిగా తమ ప్రజలను బీరూట్‌లోని యుఎస్ రాయబార కార్యాలయం కోరింది.

## జాతీయ విపత్తుగా వయనాడ్ విషాదం

కేంద్రం పరిశీలన

**వయనాడ్ :** కేరళ లోని వయనాడ్ విషాద సంఘటనను జాతీయ విపత్తుగా గుర్తించే విషయం కేంద్రం పరిశీలనలో ఉందని కేంద్ర మంత్రి సురేశ్ గోపీ తెలియజేశారు. ఎన్నో కుటుంబాల్లో విషాదం మిగిల్చిన ఈ సంఘటనను జాతీయ విపత్తుగా పరిగణించాలని వివిధ వర్గాల నుంచి డిమాండ్లు వస్తుండటంతో మంత్రి పై విధంగా వివరించారు. వయనాడ్‌లో సాగుతున్న సహాయ చర్యలను మంత్రి పరిశీలించారు. రెస్క్యూ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ విపత్తు సంభవించిన ప్రాంతాలను సందర్శించి ప్రతి విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచుతానన్నారు. విపత్తు వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్రానికి తెలియజేస్తే వీలైనంతవరకు కేంద్రం నుంచి సాయం లభిస్తుందన్నారు. ప్రాణాలతో బయటపడిన వారికి పునరావాసం కల్పించడంతోపాటు వారికి కౌన్సెలింగ్ అందించాలని మంత్రి సూచించారు. జిల్లా యంత్రాంగం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఇప్పటివరకు 200 కు పైగా మృతదేహాలను వెలికి తీశారు. ఇంకా కొందరి ఆచూకీ తెలియలేదు.

## యుపిలో రోడ్డు ప్రమాదం, ఏడుగురి మృతి

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో ఇటావాలో శనివారం రాత్రి 12.30 గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్ వే పై డబుల్‌డెక్కర్ బస్సు, కారు ఢీకొన్నాయి. మొత్తం ఏడుగురు మృతి చెందారు. 40 మంది గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా,కారులో ఉన్న ముగ్గురు కూడా ప్రమాద స్థలం లోనే చనిపోయారు.



## గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 18 మంది హతం

- కత్తిపోట్లతో ఇద్దరు మృతి
- విస్తృత యుద్ధంపై భయాందోళనలు

**టెల్ అవీవ్ :** గాజాలో ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 18 మంది వ్యక్తులు హతులు కాగా, ఒక ఆసుపత్రి సముదాయం లోపల నిర్వాసిత పాలస్తీనియన్ల కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో ఆశ్రయం పొందుతున్న నలుగురు కూడా వారిలో ఉన్నారు. ఒక టెల్ అవీవ్ శివారు ప్రాంతంలో పాలస్తీనియన్లు సాగించిన కత్తిపోట్లకు ఇద్దరు వ్యక్తులు మరణించారు. గాజాలో సుమారు 10 నెలలుగా సాగుతున్న యుద్ధం, లెబనాన్, ఇరాన్‌లలో క్రితం వారం వేర్వేరు దాడుల్లో ఇద్దరు సీనియర్ తీవ్రవాదులు హతం కావడం దరిమిలా ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెచ్చుమీరాయి. ఆ హత్యలకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్, దాని మిత్ర పక్షాలు బెదిరింపులకు దిగగా మరింత విధ్వంసకర రీతిలో ప్రాంతీయ యుద్ధం సాగవచ్చుననే భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కత్తిపోట్ల దాడిలో 70 ఏళ్లు దాటిన ఒక మహిళ, 80 ఏళ్ల పురుషుడు మరణించినట్లు, మరి ఇద్దరు గాయపడినట్లు ఇజ్రాయెల్ మగెన్ డేవిడ్ ఆడమ్ రక్షణ విభాగం, సమీపంలోని ఒక ఆసుపత్రి తెలియజేశాయి. ఒక పాలస్తీనియన్ తీవ్రవాది ఆ దాడి జరిపినట్లు, అతనిని 'వధించినట్లు' పోలీసులు తెలిపారు. క్షతగాత్రులు మూడు వేర్వేరు ప్రాంతాల్లో కనిపించినట్లు రక్షణ కార్యకర్తలు తెలియజేశారు. క్రితం వారం ఇరాన్ రాజధానిలో దాడిలో ఒక హమాస్ అగ్రశ్రేణి రాజకీయ నేత, లెబనాన్‌లో దాడిలో ఒక హెజ్బొల్లా సీనియర్ కమాండర్ హతమైన తరువాత ప్రతీకార దాడులు జరగవచ్చునని ఇజ్రాయెల్ భావిస్తోంది. ఆ రెండు హత్యలు గాజాలో ప్రస్తుతం సాగుతున్న యుద్ధంతో ముడిపడినవే.

# అరుణాచల్ పౌరులపై డ్రాగన్ పంజా?

- ఆ ప్రాంతం తమదే అంటూ తరచూ ఆగడాలు
- వనమూలికలకు వెళ్లిన వారిపై ఆటవిక దాడులు

**న్యూఢిల్లీ :** అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రెండేళ్లుగా కన్పించకుండా పొయ్యారు. వీరిని చైనాకు చెందిన సైన్యం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నిర్బంధించి ఉంటుందని అనుమానిస్తున్నారు. అయితే వారు తమ చెరలో ఉన్నట్లు చైనా సైనిక వర్గాలు నిర్ధారించడం లేదు. దీనితో వీరు ఏమయ్యారనేది కీలక విషయం అయింది. అరుణాచల్‌లోని అంజ్వా జిల్లాలో ఎతైన పర్వతాలలో అరుదైన వనమూలికల కోసం 2022 ఆగస్టు 19న ఈ ఇద్దరు వెళ్లారు. అయితే అప్పటి నుంచి వీరి జాడ తెలియకుండా పోయింది. చైనా సరిహద్దుల్లోని ఛగ్గగామ్ ప్రాంతానికి చెందిన 35 ఏండ్ల బటెలమ్ టిక్రో, ఆయన సమీప బంధువు 37 ఏండ్ల బైన్సి మన్యూల అదృశ్యం ఈ ప్రాంతంలో తీవ్ర ఆందోళనకు దారితీసింది. సరిహద్దుల్లో ఉండే తమకు భద్రత లేకుండా పోయిందని స్థానికులు తెలిపారు. తాను పలు సార్లు వీరి గురించి సైనిక అధికారులను కలిశానని, అయితే ఇప్పటికీ వారు ఇంటికి తిరిగి రాలేదని టిక్రో సోదరుడు దిశన్సో చిక్రో తెలిపారు. భారతీయ సైనిక అధికారులు చైనా అధికారులకు విషయం తెలిపారని అయితే వారి నుంచి ఎటువంటి స్పందనా లేదని వెల్లడైనట్లు టిక్రో చెప్పారు. చైనా చెరలో లేకుండా వారి జాడ తెలియకుండా పోతే ఇంతకూ వారు ఏమయినట్లు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మందుల్లో వాడే వనమూలికలను సేకరించడానికి వెళ్లిన ఇద్దరు గల్లంతు అయిన విషయాన్ని అంజ్వా ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి దసంగ్లు పల్ కూడా ధృవీకరించారు. తాము చైనా అధికారులతో మాట్లాడామని, కానీ వీరు బందీలుగా ఉన్నట్లు చెప్పలేదని, మొత్తం మీద ఈ ఇద్దరు ప్రాణాలతోనే ఉన్నట్లు తాము నమ్ముతున్నామని ఆమె వివరించారు. ఇద్దరిని చివరిసారిగా రెండేళ్ల క్రితం చైనా సరిహద్దుల వద్ద చూసినట్లు స్థానిక గ్రామస్తులు కూడా తెలిపారు.

### చైనా బందీలుగా పలువురు స్థానికులు

చైనా సరిహద్దుల్లోని గ్రామాలకు చెందిన వారు గల్లంతు కావడం ఇంతకు ముందు కూడా జరిగింది. వీరిని చైనా సైన్యం తమ బందీలుగా చేసుకోవడం జరుగుతోంది. సరైన సమాచారం కూడా ఇవ్వకుండా వారి అధీనంలో పెట్టుకుని తరువాత వదిలిపెట్టిన ఘటనలు జరిగాయి. గల్లంతు అయిన వారు కొద్ది రోజుల తరువాత తిరిగి ఇండ్లకు చేరుకుంటున్నారు. అయితే ఇప్పుడు కన్పించకుండా పోయిన వారి గురించి రెండేళ్లుగా సమాచారం లేకపోవడం ఈ ప్రాంతంలో స్థానికుల్లో భయాందోళనకు దారితీసింది. రెండేళ్ల క్రితం ఓ యువకుడిని చైనా సేనలు పట్టుకువెళ్లాయి. ఆ తరువాత విడిచిపెట్టారు. భారత్ చైనా నడుమ సరిహద్దుల ప్రతిష్టంభనల నేపథ్యంలో ఈ విధంగా సామాన్య జనం కన్పించకుండా పోవడం సమస్యను మరింత జటిలం చేసింది. ఎల్‌ఎసి వెంబడి చైనా తో 3400 కిలోమీటర్ల మేర సరిహద్దు ప్రాంతం ఉంది. ఇది లద్దాఖ్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకూ విస్తరించుకుని ఉంది. అరుణాచల్ తమదే అని చైనా తరచూ వాదించడం, దీనిని భారతదేశం నిర్ధిష్టంగా తోసిపుచ్చుతున్న నేపథ్యంలో పలు చోట్ల జరుగుతున్న జనం గల్లంతు ఘటనలు సంక్లిష్టతను పెంచాయి. చైనా ఇటీవలి కాలంలో అరుణాచల్‌ను సౌత్ టిబెట్‌గా పేర్కొంటోంది. ఈ ప్రాంతంలో భారతీయ నేతల పర్యటనల పట్ల అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. పైగా అరుణాచల్‌కు చైనా ఝూంగ్నాన్ అనే పేరు కూడా పెట్టింది. ఇవన్నీ గిల్లికజ్జాల వ్యవహారాలని భారతదేశం పలు సార్లు తిప్పికొట్టింది. పేర్లు మారిస్తే నిజాలు మారుతాయా అని ప్రశ్నించింది.

# చేపల వేటపై నిషేధం 15 వరకు పొడిగింపు

- గుజరాత్ ప్రభుత్వం నిర్ణయం
- వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్

**అహ్మదాబాద్ :** అరేబియా సముద్రంలో చేపల వేటపై నిషేధాన్ని 15 రోజుల పాటు అంటే ఈ నెల 15 వరకు పొడిగించాలని గుజరాత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ చర్య 'అన్యాయం, నిర్లక్ష్యంతో కూడుకున్నది' అని కాంగ్రెస్ విమర్శించింది. ఇది మత్స్యకారులకు ఆర్థిక నష్టాలు కలుగజేస్తుందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. చేప పిల్లల పెరుగుదలకు మరింత వ్యవధి ఇవ్వాలన్న మత్స్యకారుల సంఘం వినతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు గుజరాత్ ఫిషరీస్ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలియజేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయానికి రావడానికి ముందు శాస్త్రీయ డేటాను, వాతావరణ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకున్నదని ఆయన తెలిపారు. పశ్చిమ తీరంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఈ మార్పును అనుసరించవచ్చునని ఆయన సూచించారు. 2021 నుంచి గుజరాత్‌లో చేపల వేటపై వార్షిక నిషేధం జూన్ 1 నుంచి జూలై 31 వరకు అమలులో ఉంటున్నది.

# కృత్రిమ అవయవాల కోసం వికలాంగుల అగచాట్లు

- నిధులు మంజూరైనా అందని పరికరాలు
- ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటున్న వికలాంగులు

**మన తెలంగాణ / హైదరాబాద్ :** వికలాంగులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వస్తున్నా ఇబ్బందులు తప్పడంలేదు. నిరుపేద వికలాంగులకు కృత్రిమ అవయవాల కోసం ప్రభుత్వం సహాయం అందిస్తోంది. అయితే వాటిని అందించాల్సిన వారి వల్ల ఆగచాట్లు తప్పడం లేదంటూ వికలాంగులు వాపోతున్నారు. సిఎం సహాయనిధి నుండి నిధులు మంజూరైనా కృత్రిమ అవయవాలను సకాలంలో అందించకుండా వికలాంగులకు ముప్పతిప్పలు పెడుతోంది ప్రైవేటు సంస్థ. వికలాంగుల కార్పొరేషన్‌కు చెందిన కృత్రిమ అవయవాలు తయారు చేసే యూనిట్లు గాంధీ, నిమ్స్ ఆసుపత్రుల్లో ఉన్నాయి. ఇక్కడ జైపూర్ టెక్నాలజీతో కృత్రిమ అవయవాలను తయారు చేసి వికలాంగులకు అందించడం జరుగుతోంది. ఆధునిక టెక్నాలజీ లేకపోవడంతో నిమ్స్ వైద్యులు కృత్రిమ అవయవాల తయారీని ప్రైవేటు సంస్థకు అప్పగించారు. లెటెస్ట్ టెక్నాలజీతో కృత్రిమ అవయవాలు కావాలనుకునే వారికి నిమ్స్ వైద్యులు ఎస్టిమెట్ లెటర్ ఇస్తారు. దాని ప్రకారం కాంట్రాక్ట్ తీసుకున్న ఎండోలైట్ అనే సంస్థ వాటిని అందిస్తుంది. అయితే గత కొంత కాలంగా ఆ సంస్థ సకాలంలో కృత్రిమ అవయవాలను అందించక నెలల తరబడి కాలయాపన చేస్తున్నట్లు వికలాంగులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్ పార్శిగుట్టకు చెందిన కె. వెంకన్న అనే నిరుపేద వికలాంగుడికి కృత్రిమ అవయవం కోసం ఎండోలైట్ సంస్థను సంప్రదించారు. అయితే ఆ ఎస్టిమేట్ లెటర్ తీసుకున్న రెండు నెలలకు పిలిచి ఆ సంస్థ కొలతలు తీసుకుంది. ఆ తర్వాత అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసి చివరికి ఆరు నెలలు గడిచిన తర్వాత సిఎం రిలీఫ్ ఫండ్ నుండి నిధులు వస్తే తప్ప కృత్రిమ అవయవం అమర్చమని చెప్తున్నట్లు బాధిత వికలాంగుడు వాపోయారు. దీనిపై తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఆ సంస్థపై చర్య తీసుకోవాలని వికలాంగులు కోరుతున్నారు. ప్రతి రోజు నాలుగు కేసులు కృత్రిమ అవయవాల కోసం నిమ్స్ నుండి ఎండోలైట్ సంస్థ కు పంపించడం జరుగుతోందని తెలిసింది. వారంలో అందించాల్సిన కృత్రిమ అవయవాలను నెలల తరబడి అందించకపోవడంపై వికలాంగుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

# ఇంటి గోడ కూలి 9 మంది చిన్నారులు సజీవ సమాధి

షాపూర్‌లోని దుర్ఘటన



**సాగర్ (మధ్య ప్రదేశ్) :** మధ్య ప్రదేశ్ సాగర్ జిల్లాలో ఆదివారం విషాదం చోటు చేసుకుంది. సాగర్ జిల్లాలో ఒక పాడుపడిన ఇంటి గోడ కూలడంతో తొమ్మిది మంది పిల్లలు సజీవ సమాధి అయినట్లు, మరి ఇద్దరు గాయపడినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలియజేశారు. అధికారుల సమాచారం ప్రకారం, రేవా అసెంబ్లీ నియోజకవర్గంలోని షాపూర్ గ్రామంలో ఒక మత కార్యక్రమం సమయంలో ఒక ఆలయం సమీపంలో ఉదయం 8.30, 9 మధ్య ఈ దుర్ఘటన సంభవించింది. ఇంత వరకు అందిన సమాచారం ప్రకారం, షాపూర్‌లో ఒక మత కార్యక్రమంలో గోడ కూలిన సంఘటనల 10, 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న తొమ్మిది మంది పిల్లలు మరణించినట్లు, ఇద్దరు గాయపడినట్లు సాగర్‌డివిజనల్ కమిషనర్ వీరేంద్ర సింగ్ రావత్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ సహా సీనియర్ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నట్లు ఆయన తెలిపారు. మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ సంఘటనపై విచారం వెలిబుచ్చారు. మృతుల సమీప బంధువులకు రూ. 4 లక్షలు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు సిఎం తెలియజేశారు. పాడుపడిన ఇంటి సమీపంలో ఒక గుడారం కింద 'పార్థివ్ శివ్ లింగ్ నిర్మాణ్' (మట్టితో శివలింగం తయారీ) కార్యక్రమం సాగుతోందని, గోడ కూలి గుడారంపై పడిందని స్థానిక బిజెపి ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి గోపాల్ భార్గవ విలేకరులతో చెప్పారు. గుడారం,శిథిలాల కింద పిల్లలు సమాధి అయ్యారని భార్గవ తెలిపారు. పిల్లలు గుడారం కింద కూర్చున్నారని, వర్షాల వల్ల ఇంటి గోడ కూలిందని జిల్లా కలెక్టర్ దీపక్ ఆర్య తెలిపారు.

# అవయవ తొలగింపు రహిత
# భారతదేశం కోసం అవగాహన

## గుంటూరులో వాకథాన్‌ను నిర్వహించిన వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా







**గుంటూరు,ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** జాతీయ వాస్కులర్ డే సందర్భంగా, అవయవ తొలగింపు నివారణ మరియు రక్త నాళ (వాస్కులర్) ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించటం కోసం వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా (విఎస్ఐ) గుంటూరులో వాకథాన్ ను నిర్వహించింది. ఈ వాకథాన్‌లో 500 మందికి పైగా నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్ టి ఆర్ స్టేడియం వద్ద ఈ వాక్ జరిగింది. గుంటూరుతో సహా 30 నగరాల్లో నిర్వహించిన జాతీయ వాకథాన్‌లో 15,000 మందికి పైగా పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 1 మిలియన్ కు పైగా వ్యక్తులకు అవయవాలను తొలగించటం జరుగుతుంది. వీటిలో అధిక శాతం ముందస్తు జోక్యం మరియు ప్రమాద కారకాల సరైన నిర్వహణ ద్వారా నివారించబడుతుంది. భారతదేశంలో, దాదాపు 40-50% అవయవ తొలగింపు కేసులలో రక్తనాళాల వ్యాధులు, ముఖ్యంగా మధుమేహం కారణమవుతుంది. హై బ్లడ్ షుగర్, హైపర్‌టెన్షన్ మరియు అధిక కొలెస్ట్రాల్ వంటి ప్రమాద కారకాలను నిర్వహించడానికి అవగాహన మరియు నివారణ చర్యల యొక్క క్లిష్టమైన అవసరాన్ని ఇది వెల్లడి చేస్తుంది. ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన డాక్టర్ విజయ్ విష్ణుమొలకల, వాస్కులర్ ఎండో వాస్కులర్ సర్జన్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వారు మాట్లాడుతూ "ఫిట్‌నెస్ మరియు వాస్కులర్ ఆరోగ్యం గురించి అవగాహన పెంచడం అనే ద్వంద్వ లక్ష్యాలతో నిర్వహించిన ఈ వాకథాన్‌ను నేను అభినందిస్తున్నాను. భారతదేశంలో డయాబెటిక్ మహమ్మారి తీవ్రతరం అవుతోంది, ఇది నివారించదగిన అవయవ తొలగింపు యొక్క ముప్పును పెంచుతోంది. ముందస్తుగా గుర్తించడం మరియు నివారణ చర్యలను నొక్కి చెప్పడం ద్వారా అవయవ తొలగింపు -రహిత ప్రపంచం కోసం ప్రచారం చేయటంలో ఇటువంటి సంఘటనలు కీలకమైనవి. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియాకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను, దీని చురుకైన జోక్యం మరియు నిరంతర మద్దతు వాస్కులర్ వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కమ్యూనిటీలకు అవసరమైన పరిజ్ఞానం మరియు వనరులను అందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది " అని అన్నారు. ఈ కార్యక్రమం పై వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా సెక్రటరీ డాక్టర్ తపిష్ సాహు మాట్లాడుతూ అవయవ తొలగింపు రహిత భారతదేశం కోసం కృషి చేస్తూ, సమగ్ర వాస్కులర్ ఆరోగ్య సంరక్షణ కార్యాచరణను ఏర్పాటు చేయడం ద్వారా సమాజ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మా లక్ష్యం. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలకు వస్తున్న అద్భుతమైన స్పందన చాలా ప్రోత్సాహకరంగా ఉంది. ఇంతటి మహోన్నత కారణం కోసం చాలా మంది కలిసి రావడం స్ఫూర్తిదాయకంగా ఉంది. ఈ వాక్‌థాన్ వాస్కులర్ హెల్త్ యొక్క ప్రాముఖ్యతను వెల్లడించటమే కాకుండా మార్పును నడిపించడంలో సంఘం యొక్క శక్తిని కూడా నొక్కి చెబుతుంది అని అన్నారు. భారతదేశంలో నివారించగల అవయవ తొలగింపు ను తగ్గించాలనే మా లక్ష్యంలో నేటి కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయి" అని లివాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ పి సి గుప్తా అన్నారు.లి "దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తుల భాగస్వామ్యం, వాస్కులర్ ఆరోగ్యం పట్ల పెరుగుతున్న నిబద్ధతను మరియు అర్థవంతమైన మార్పును నడపడంలో సామూహిక చర్య యొక్క శక్తిని ప్రదర్శిస్తుంది" అని అన్నారు.

వాస్కులర్ వ్యాధులను నివారించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయటం మరియు సాధారణ వైద్య పరీక్షలను నిర్వహించడం వంటి బహుముఖ విధానం అనుసరించడం అవసరం. పండ్లు, కూరగాయలు మరియు తృణధాన్యాలు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం, ధూమపానం మరియు అధిక మద్యపానానికి దూరంగా ఉండటం, రక్తనాళాల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. అదనంగా, మందులు మరియు జీవనశైలి మార్పుల ద్వారా అంతర్లీన జీవనశైలి పరిస్థితులను నిర్వహించడం వాస్కులర్ సమస్యల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ నివారణ చర్యలు మరియు వాస్కులర్ ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించడం మరియు చికిత్స చేయడం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయడానికి అవగాహన ప్రచారాలు మరియు విద్యా కార్యక్రమాలు నిర్వహించటం చాలా అవసరం అన్నారు.

### స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించిన
## సేవాస్ఫూర్తి కమిటీ 1989-90 బ్యాచ్



**కొరిశపాడు ,ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** స్నేహితుల దినోత్సవంను ఎస్ ఎస్ సి 1989 -90 పూర్వ విద్యార్థుల సేవ స్ఫూర్తి కమిటీ మిత్రులు ఘనంగా నిర్వహించారు సింగరకొండ రోడ్డు లోని చైతన్య బధిరుల పాఠశాలలో కేక్ కట్ చేసి స్నేహితులు అందరూ కలిసి బధిర వికలాంగ పిల్లల మధ్య అట్టహాసంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలకు కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్ వాటర్ బబుల్ అందజేసి 65 మంది పిల్లలకు మధ్యాహ్నం, సాయంత్రం రెండు పూటలా భోజనాలు మొత్తం రూ 26,000/-తో ఏర్పాటు చేశారు కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్ బాబు మాట్లాడుతూ 2015లో ఏర్పడిన సేవాస్ఫూర్తి కమిటీ గత తొమ్మిది సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం వృద్ధాశ్రమాలు, అనాధాశ్రమము, బధిరుల పాఠశాలలలో స్నేహితుల దినోత్సవం మిత్రులందరము కలిసి జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఇప్పటికి రూ 36 లక్షలు కు సేవకార్యక్రమాలు నిర్వహించామని భవిష్యత్ లో కూడా ఇలానే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు..కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్ బాబు, ఉప కార్యదర్శి ధర్మవరపు వెంకటరావు, ట్రెజరర్ కొత్త శ్రీమన్నారాయణ, సభ్యులు బాలాజీ, పురుషోత్తం, నరహరి, ఘంటసాల శ్రీను, పల్లపోతు శ్రీను, గార్లపాటి మురళి, బొడ్డపాటి మురళి, పసుమర్తి ప్రసాద్, గురుశేఖర్, చెన్నుపల్లి నాగేశ్వరరావు, సత్యనారాయణ, బెల్లం రాజేష్, సురేంద్ర, 27 మంది మిత్రులు మరియు పాఠశాల చైర్మన్ పూనూరు ఆరోగ్యం పాల్గొన్నారు

## ఘనంగా జీవి పదవి విరమణ కార్యక్రమం



**బాపట్ల ,ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** ఉపాధ్యాయుడు, చిత్రకారుడు, సమాజ సేవకుడిగా బధిరుల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు గూడం శెట్టి వెంకటేశ్వరరావు బహుముఖ సేవలందించారని సిఐడి డిఎస్పి గోలి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం గూడం శెట్టి వెంకటేశ్వరరావు పదవి విరమణ సందర్భంగా బాపట్ల పుస్తక ఉద్యమ సమితి ఆధ్వ ర్యంలో స్థానిక ఎకో హౌస్ లో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రకారుడిగా సత్తా చూపి, పలు అవార్డులను జీవి సొంతం చేసుకున్నారన్నారు. ప్రభుత్వ బధిరుల పాఠశాలలో మూగ చెవిటి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంలో జీవి ఎంతో నేర్పరితనంగా బాధ్యతలు నిర్వర్తించారు . సంగీత, సాహిత్య రంగాలలో తమ ప్రతిభను చాటుకున్నారన్నారు. తెలుగు భాష పై ఆయనకు విపరీతమైన మక్కువ. నీతి నిజాయితీ, నిబద్ధత లతో జీవిస్తూ 'బాపట్ల భారతీయుడి'గ ఖ్యాతి కెక్కారన్నారు. సహృదయుడిగా, స్నేహశీలిగా, మృదు స్వభావిగా పేరు గాంచారన్నారు. మానవత అధ్యక్షులు డాక్టర్ బి శరత్ బోస్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పి.సి సాయిబాబు, శాఖా గ్రంథాలయ అధికారి ఎ. శివాజీ గణేషన్, రచయిత మల్లికార్జున, చిత్రకారులు తోట వెంకట నారాయణ, ఉమామహేశ్వర రావు, ఆర్ట్స్ కళా శాల విశ్రాంత ప్రిన్సిపాల్ డబ్ల్యూ జి కే మూర్తి, భావపురి రచయితల సంఘం నాయకులు తిమ్మన శ్యామ్ సుందర్, భాగి కృష్ణ మూర్తి,కోలా సుబ్బారావు, వాసుదేవరావు, ప్రసన్నాంజనేయులు, పద్మజ, రచయిత నందిరాజు విజయకుమార్ . హేతువాద సంఘం నాయ కులు కరణం రవీంద్రబాబు పాల్గొన్నారు.

## బాధితులకు తోడుగా వైఎస్ఆర్సిపి
### పరామర్శించిన ప్రతాప్



**అగిరిపల్లి, , ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** ఆగిరిపల్లి మండలం నరసింగ పాలెం గ్రామంలో స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇటీవలి వేరు వేరు వర్గాల వారు దాడి చేసుకొనగా అందులో "పత్తిపాటి సారమ్మ"అనే మహిళకు చెయ్యి విరిగిందని తెలిపారు. విషయం తెలుసుకున్న నూజివీడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆమెను పరామర్శించి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పంపిన 50 వేల రూపాయలు చెక్కును అందజేసి వైయస్సార్ పార్టీ బాధితులకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు .ఈ కార్య క్రమంలో మచ్చ హరిబాబు, జడ్పిటిసి పిల్లి బోయిన వీరబాబు, పలగాని నరసింహారావు , మల్లంపల్లి రవి, అగిరిపల్లి ఎంపీటీసీ సాదం గోపి, ఎర్రబాబు మరియు

## డాక్టర్ ఎం. సుహాసినికి ఘనంగా సన్మానం
### ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు



**ఎ. కొండూరు ,ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** జిల్లా న్యాయ సేవలు సంస్థ.మచిలీపట్నం వారి అధ్వర్యంలో తిరువూరు న్యాయ సేవల సంస్థ వారు, గిరిజన సంక్షేమ శాఖ వారు ఎ.కొండూరు మండలం జీళ్ళకుంట గ్రామం లో శనివారం నిర్వహించిన గిరిజన ప్రజల సంక్షేమం కోసం జరిగిన సదస్సులో వైద్య శిబిరంనకుఆ ముఖ్యఅతిథిగా విచ్చేసిన గౌరవ శాసన సభ్యులు శ్రీ కొలికపూడి శ్రీనివాసరావు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ యం. సుహాసిని స్వాగతం పలుకుతున్న సందర్భంలో ఇటీవల తిరువూరు నియోజక వర్గపరిధిలో ప్రబలిన సీజనల్ వ్యాధులు అదుపు చేయటంలో కృషి చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా ఎం సుహాసిని సేవలకు గుర్తింపుగా దుశ్శాలువా కప్పి తన ఔన్నత్యాన్ని కనబరచడం జరిగినది.ఈ సందర్భంగా గౌరవ శాసన సభ్యులు శ్రీ కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మీరు సీజనల్ వ్యాధుల అదుపుకు కృషి చేస్తున్నందుకుమీకు మేము సత్కరించాలని ఆమెకు దుశ్శాలువ కప్పి వారి సేవల గురించి కోనియాడటం జరిగినది.ఈ కార్యక్రమం లో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, జిల్లా ఎన్ సి డి సి డి కార్యక్రమ అధికారి డాక్టర్ మాధవి, వైద్యాధికారి డాక్టర్ వేములకొండస్వాతి,శృతి వివిధ శాఖలకు చెందిన వైద్యాధికారులుఎ.కొండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య సిబ్బంది సూపర్వైజర్ ఎం బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

### లోక కల్యాణార్థమై శ్రీ విశ్వకర్మ పీఠం నందు
## పంచ సూక్త రుద్రాబిషేకం



**గుంటూరు,ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** లోక కల్యాణార్థమై ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతొ భోగ భాగ్యలతో వర్థిల్లాలని. అకాంక్షిస్తు మహదేవుని ప్రార్థిస్తూ గుంటూరు ఏటి అగ్రహారం జీరో లైన్ పి.వి.ఆర్ రరెసిడెన్స్ ప్రక్కన అత్యంత వైభవోపేతముగా పంచ సూక్త రుద్రాబిషేకం ను శ్రీ విశ్వకర్మ పీఠం నందు నిర్వహించడమైనది, తదనంతరం రుద్రహోమం నిర్వహించడ మైనది. ఈ సందర్భముగా శ్రీ విశ్వకర్మ ట్రస్ట్ నిర్వాహకులు, మరియు పీటాధిపతులు, శ్రీ యోగి మహేశ్వరానంద స్వామిజి మాట్లడుతూ, శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహేంద్ర స్వామిజి కాల్జ్ఞానాన్ని అనుసరించి రాబొవు రోజులలో ప్రకృతి వైపరీత్య కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన వలసి ఉన్నందున, వాటిని అధిగమించే శక్తి మానవ మాత్రుల శక్తి, తెలివితేటలు సరిపొవు కనుక వాటిని తట్టుకుని ప్రగతి ప్రధాన ప్రయణించాలి అంటే ప్రతి ఒక్కరూ ధర్మ మార్గములో ప్రయాణిస్తు, ప్రకృతి సంబంధ కార్యక్రమాలకు అవరోధం కల్పించకుండా సన్మార్గములో ప్రయాణిస్తే రాబొవు విపత్తుల నుండి బయటపడవచ్చు అన్నారు. దీనిలో భాగంగా లోక కల్యాణార్థమై ప్రతి పౌర్ణమి ఘడియలలో అమ్మ అనుగ్రహం అందరిపై చల్లగా ఉండేందుకు "చండి హొమం " మాస శివరాత్రి పర్వదినములలో మహన్యాస పూర్వక అభిషేకం, మరియు అమావాస్య ఘడియలలొ మహదేవునకు ప్రీతికరమైన రుద్ర హొమం లు జరుగుచున్నవి. కావున ఆర్థిక, అరోగ్య, వ్యక్తిగత ఇబ్బందులు ఎదుర్కొనే వారి కి వారి వారి గోత్రనామలతో ఉచితముగ, అమ్మవారి అయ్యవార్ల అనుగ్రహం పొందే అవకాశాన్ని కలుగ చేస్తున్నామని తెలియచేశారు. మహదేవుని అభిషేకానంతరం, రుద్రహొమం జరిగినది కార్యక్రమాంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేయడమైనది.

### నీతి నిజాయితీ స్వచ్ఛతకు
## ఎన్టీఆర్ నిలువెత్తు నిదర్శనం
### ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పెమ్మసాని



**గుంటూరు,ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** నీతి నిజాయితీ స్వచ్ఛతకు ఎన్టీఆర్ నిలువెత్తు నిదర్శనం అని 40 ఏళ్ల టిడిపి ప్రయాణం లో ఎన్నో ఒడిదుడుకులను ఎదిరించి నిలబడిందంటే కార్యకర్తలు, నాయకులే కారణం.' అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని 39 వ డివిజన్, మారుతీ నగర్ లో టిడిపి సీనియర్ కార్యకర్త సింగిశెట్టి వీరయ్య ఆధ్వర్యం లో ఏర్పాటుచేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం టిడిపి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో పెమ్మసాని మాట్లాడుతూ కార్యకర్తలను ఆదుకోవడమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామన్నారు. స్థానికంగా రోడ్లు, డ్రైన్లు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, కార్పొరేషన్ కమిషనర్ తో మాట్లాడి అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని వివరించారు. వైసీపీ కార్పొరేటర్ లను కూడా కలుపుకుంటూ వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహమ్మద్ నశీర్ అహ్మద్, టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, టిడిపి నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, టిడిపి బీసీ నాయకులు నిమ్మల శేషయ్య, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే గళ్ళ మాధవి
## జన్మదిన పురస్కరించుకొని ముందస్తు వేడుకలు
### పలు చోట్ల రక్తదాన శిబిరాలు, మొక్కల పంపిణీ కార్యక్రమం





**గుంటూరు ,ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్ళ మాధవి జన్మదిన పురస్కరించుకొని ఆదివారం పార్టీ శ్రేణులు అభిమానులు ముందస్తు వేడుకలు నిర్వహించారు. 22 డివిజన్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై రక్తదానాన్ని చేశారు ఈ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నల్ల మాధవి ప్రారంభించి నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం టిడిపి నాయకుడు తిరివీధి హరికృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యి ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. గుంటూరు పశ్చిమ నియోజవర్గ టీడీపీ మైనారిటీ నేత షేక్ సుభానీ పుట్టినరోజు కానుకగా 100 పుస్తకాలు, పెన్నులను అందజేసి ఎమ్మెల్యే గళ్ళా మాధవికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ జన్మదినము అంటే గజమాలలు, బొకేలు శాలువాలతో డబ్బులను వ్యర్థం చేయటం కాదని, మన కష్టపడి సంపాదించిన ప్రతి రూపాయిలో కొంత భాగం పేద ప్రజల కోసం ఖర్చు పెట్టాలని,సమాజ హితం కోసం పాటు పడాలని కోరారు. అదేవిధంగా నా జన్మదినాన్ని పురస్కరించుకొని సయ్యద్ చాంద్ తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం చేయటం అందులో 100మందికి పైగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆళ్ళహరి, రుద్ర సుభాని, అనాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ వర్గీకరణ పైన 21న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి
### దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపు.



**అమరావతి,ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** రాజ్యాంగం నిబంధనలకు వ్యతిరేకంగా నరేంద్ర మోడీ బిజెపి కేంద్ర సర్కార్ రాజకీయ ప్రయోజనాలకు కట్టుబడి ఈ తీర్పు ఇచ్చారని ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ ల్లో క్రిమిలేయర్ నుఅమలు చేయాలని కుట్రలు తో ఈ తీర్పు వెనుక మొత్తం రిజర్వేషన్ లను రద్దు చేసే సామాజిక కుట్రలు దాగి ఉన్నాయని సుప్రీమ్ కోర్టు తీర్పును నిరసిస్తూ ఎస్సీ ఎస్టీ వర్గీకరణ పైన 21 న చేపట్టిన భారత్ బంద్ ను విజయవంతం చేయాలి అని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపు ఇచ్చారు. పార్లమెంట్ భారత రాష్ట్ర పతి ప్రమేయం లేకుండా ఉదేశ్యం పూర్వకంగా నే ఆర్టికల్ 341 కు వ్యతిరేకంగా జరిగిందన్నారు. ఆర్టికల్ 14.15.16 ఆర్టికల్ లను వక్రీకరిస్తూ ఈ కేసులో తీర్పు ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు లేని అధికారాలను. సుప్రీం కోర్ట్ కీ లేని అధికారాలను ఉపయోగించికొని ఈ తీర్పు ను కాంగ్రెస్ సహకారం తో నరేంద్ర మోడీ తీర్పు చెప్పించరన్నారు. సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ డీ. వై. చంద్ర చూడ్ బెంచ్ ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక తీర్పు ను మొత్తం యావత్ దేశంలోని ఎస్సీ. ఎస్టీ దళిత సమాజం మొత్తం వ్యతిరేకిస్తుందని ఉత్తర భారత్ లో పెద్ద ఎత్తున తిరుగుబాటు లేచిందని సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నెల 21 న దేశ వ్యాప్తంగా భారత్ బంద్ కు దళిత బహుజన సంస్థలు రాజకీయ పార్టీ లు ఉద్యమం. సామాజిక ప్రజా సంఘాలు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. బంద్ ను ఉధృతం చేయాలని దళితుల సత్తా చాటాలని. ఆర్.ఎస్.ఎస్. బిజెపి నరేంద్ర మోడీ సర్కార్ కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం సోనియా. రాహుల్ గాంధీ. మల్లికార్జున ఖర్గే. ప్రియాంక గాంధీ లకు ఒనుకు పుట్టాలన్నారు ఈ ఇర్వు కి 1818 లోని మహారాష్ట్ర పూనె లో పీస్వా బ్రాహ్మణ రాజ్యం ను ఓడించిన భీమాకారోగావ్ మహర్ రెజిమెంట్ దళితుల పోరాటం విజయానికి ప్రతీకారం గానే పూనె ప్రాంతానికి పీస్వా వంశానికి చెందిన ప్రస్తుతం సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ చంద్ర చూడ్ తన తీర్పు ద్వారా దేశంలో దళిత జాతుల ఐక్యత శక్తి ని నిర్వీర్యం చేసి వీరి మధ్య ఉన్న జాతి ఐక్యత పోరాట పునాదిని విచ్చిన్నం చేయదానికి ప్రధాన%వా% గా పొలిటికల్ పవర్ లోకి ఈ నిమ్న దళిత జాతులు రానీయకుండా. శాశ్వతం గా శత్రువులు గా మార్చడానికి బాబాసాహెబ్ డాక్టర్. అంబేద్కర్ పోరాట స్ఫూర్తి ని ధ్వంసం చేయడానికి చీఫ్ జస్టిస్ చంద్ర చూడ్ సామాజిక కుట్ర చేసారని కృష్ణ స్వరూప్ తీవ్రంగా ఆరోపణలు చేశారు. దళిత జాతుల బౌషత్ ను సమాధి చేసే వర్గీకరణ తీర్పు ను రద్దు చేసే వరకూ పోరాటం ఆగకూడదన్నారు. వర్గీకరణ అంతం దళితుల పంతం గా ఉండాలన్నారు. ఈ సమావేశం లో మాలమహానాడు జాతీయ కేంద్ర కమిటీ అధ్యక్షులు డాక్టర్. వీ.ఎల్. రాజు.తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జె న్. రావు. ఏపీ రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్. జాతీయ ఉపాధ్య క్షులు జొన్నలగడ్డ భాస్కరావు దళిత బహుజన పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిలివేరి వసంత్ రావు. ఏపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ఉప్పాడ రామచంద్ర రెడ్డి.తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రక్తపు బొట్టు దేశం కోసమే
### : తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు ,ఆగస్టు 05, జర్నలిస్ట్ ఫైల్ :** మనం రక్తదానం చేసే ప్రతి రక్తపు బొట్టు దేశం కోసం ఉపయోగపడాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం గుంటూరు తూర్పు శాసన సభ్యుల వారి కార్యాలయంలో కంపానియన్ షిప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నిర్వహించబోయే బ్లడ్ డొనేషన్ క్యాంప్ బ్రోచర్ ను గుంటూరు తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నశీర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కాంపానియన్ షిప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతో మందితో రక్తదానం చేయించి ఎంతోమందికి ప్రాణదానం చేశారన్నారు. ఆగస్ట్ 15 న గుంటూరులోని బిఆర్ స్టేడియం ఎదురుగల అంజుమన్ షాది ఖానా లో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయబోతున్నారని అందులో ప్రతి ఒక్కరు భాగస్వాములై రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలు కాపాడి వాళ్ళ కుటుంబాల్లో వెలుగుని నింపుదామన్నారు. కాంపినియన్ షిప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షబ్బీర్ను సిరాజ్ ని అభినందిస్తూ రాబోయే రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేసి మరి ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిరాజ్, షబ్బీర్, మునీర్, మన్సూర్, జాబీర్, షఫీ, ఇర్ఫాన్, అలీ, తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ గేట్లు ఎత్తివేత



**నాగార్జునసాగర్(జర్నలిస్ట్ ఫైల్) :** నాగార్జునసాగర్ గేట్లు ఇవాళ తెరుచుకున్నాయి. ఎగువ నుంచి భారీగా వరద చేరుకుంటున్న నేపథ్యంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు రేడియల్ క్రస్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా కృష్ణమ్మకు ఎస్ఈ నాగేశ్వరరావు, సీఈ అనిల్‌కుమార్ జలహారతి ఇచ్చి నీటిని దిగువకు విడుదల చేశారు. తొలుత దిగువ ప్రాంతాల ప్రజల అప్రమత్తత కోసం మూడుసార్లు సైరన్ మోగించారు. అనంతరం ఒక్కొక్కటిగా ఆరు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్ క్రస్టు గేట్ల ద్వారా దాదాపు 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నీటి నిల్వ 290 టీఎంసీలు పూర్తి స్థాయి నీటి నిల్ల 312 టీఎంసీలుగా ఉంది. నాగార్జునసాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవాహం ఎక్కువైతే అధికారుల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ దిశా నిర్ధేశం చేశారు.

# శ్రీశైల మల్లికార్జున క్షేత్రానికి శ్రావణ శోభ..

### ○భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరులు..

**శ్రీశైలం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రముఖ ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలం దేవస్థానంలో శ్రావణమాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 3 గంటలకు మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల ఆలయ ద్వారాలు తెరిచి.. ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. 4.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలకు అనుమతించారు. భక్తులు వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో స్నానాలు చేసి స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం బారులు తీరారు. సాయంత్రం కాలం వరకు భక్తులు దర్శనాలు చేసుకున్నారు. నాలుగు వరుసల క్యూలైన్లలో భక్తులకు దర్శనాలు కల్పించారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, బిస్కెట్స్, అల్పహారం అందించారు.

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చలను నిలిపివేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మరో వైపు ఉదయం 10.30 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ భవనంలో అన్నదానం చేశారు. అలాగే, రాత్రి 7 గంటల నుంచి అల్పాహారం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి.



**శివచతుస్సప్తాహ భజనలు**

శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో శివచతుస్సప్తాహ భజనలు ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రారంభమైన ఈ భజన కార్యక్రమాలు రేయింబవళ్లు నిరంతరాయంగా కొనసాగనున్నాయి. పవిత్ర అఖండ భజనలు శ్రావణమాస ప్రారంభం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని వీరశిరోమండపంలో ప్రారంభించగా.. ఈవో పెద్దిరాజు, అర్చకులు పాల్గొన్నారు. ముందుగా వేదపండితులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం కార్యక్రమం విజయవంతంగా సాగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శాస్త్రోక్తంగా చండీశ్వరస్వామివారికి విశేషపూజలు నిర్వహించి.. శివప్రణవ పంచాక్షరీనామ భజనను మొదలుపెట్టారు. ఏపీలోని కర్నూలుకు చెందిన అయిదు భజన బృందాలు, కర్ణాటకకు చెందిన మూడు భజన బృందాలకు ఈ శ్రావణమాస శివభజనలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఎనిమిది బృందాలు విడతలవారీగా భజన కార్యక్రమాలు కొనసాగించనున్నారు.

## పొలములో వరి నాట్లు వేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి



**అల్లూరి (జర్నలిస్ట్ ఫైల్) :** మండలంలో తంటికొండ పంచాయితీ ఒట్టిగడ్డ గ్రామంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి వరినాట్లు వేశారు. రాజవొమ్మంగి మండలంలో ఎమ్మెల్యే శిరీషదేవి పర్యటన నేపథ్యంలో జడ్డంగి నుండి రాజవొమ్మంగి మార్గమధ్యంలో ఒట్టిగడ్డ గ్రామ శివారులో ఆగి వరి నాట్లు వేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని వారితోబాటు కొద్దిగా సేపు వరి నాట్లు వేశారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కూలీలకు ఎమ్మెల్యే శిరీష దేవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఎం విజయభాస్కర్, జెడ్పిటిసి వడుగుల జ్యోతి, పలువురు టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.

## రైల్వే స్టేషన్లో నీటి వృధా



**కడప (జర్నలిస్ట్ ఫైల్) :** నీటిని వృధా చేయకుండా ప్రతి నీటి బట్టును ఆదా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. నీరు లేక పోతే కరువు పరిస్థితులు ఏర్పడతాయని వర్షపు నీరు సైతం వఅధా కాకుండా ఒడిసి పట్టాలని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ముద్దనూరు రైల్వే స్టేషన్లో ఇందుకు భిన్నంగా ఉంటుంది. రైల్వే స్టేషన్లోని మొదటి ప్లాట్ ఫాంలో ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చేసిన నీటి కుళాయిల్లో నీరు వృధాగా పోతున్నాయి. నీరు పారుతూ ఉండడంతో ప్లాట్ ఫాంలో పాచి పట్టి మురుగుగా తయారైంది. దీంతో ప్రయాణికులు,వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు రైలు ఎక్కే సమయంలో పాచిపైన అడుగు పెడితే కాలు జారి రైలు కిందపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు, స్థానికులు అంటున్నారు. రైల్వే స్టేషన్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రైల్వే స్టేషన్ అధికారులు స్పందించి వృధాగా పోతున్న నీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుని ప్లాట్ ఫాంపై ఏర్పడిన పాచిని తొలగించి శుభ్రంగా ఉంచాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

## గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం పవిత్రతను కాపాడండి

**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి ఆలయ పవిత్రతను అధికారులు కాపాడాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, గండి దేవస్థానం మాజీ చైర్మన్ వడ్లకుంట రాజారావులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ, గండిలో జరిగే శ్రావణ మాస వారోత్సవాలు సందర్భంగా వేసిన ఆహ్వాన పత్రికలను గండి ఇఓ ముద్రించడం జరిగిందని చెప్పారు. అయితే ఆ ఆహ్వాన పత్రికల్లో సిఎం చంద్రబాబు నాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఫోటోలు ముద్రించక పోవడం దారుణమన్నారు. గండి ఇఓ ఆలయ ప్రధాన అ- ర్చకులు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గండి దేవస్థానానికి మంచి అధికారిని వేయాలని ముఖ్యమంత్రి దృష్టి కూడా తీసుకువెళ్తామని చెప్పారు. అదేవిధంగా అ- ర్చకులను కూడా ఇతర ప్రాంతాల్లో ఉన్న దేవాలయాలకు మార్చాలని డిమాండ్ కోరారు. గండి దేవస్థానంలో అర్చకులు చెప్పిందే వేదంగా మారిందని చెప్పారు. గతంలో గండి దేవస్థానంకు ఇఓగా పని చేసిన అధికారి నిత్యాన్నదానంకు

దాదాపు రూ 4 కోట్లు వరకు దాతల సహకారంతో వసూలు చేశారని అ డబ్బులను కూడ బ్యాంకు లో డిపాజిట్ చేయడం జరిగిందని చెప్పారు.



అయితే ప్రస్తుతం ఉన్న ఈఓ, అర్చకులు అ డబ్బులు హారతి కర్పూరం లాగా అయిపోతాయని గండిలో పని చేసే సిబ్బంది, మరికొందరు అ- ర్చకులే చర్చించుకోవడం శోచనీయం అన్నారు. . గండికి వచ్చే భక్తులు హారతి పళ్లెంలో వేసే డబ్బులు లక్షల రూపాయలు వస్తున్నట్లు చెప్పారు. అ హారతి పళ్లెం డబ్బులను అర్చకులు తీసుకోవడం జరుగుతున్నదని చెప్పారు. లక్షల రూపాయలు హారతి పళ్లెం డబ్బులను అర్చకులు గండి కొట్టుతున్నట్లు చెప్పారు. హారతీ పళ్లెం డబ్బులను హుండిలో వేయాలని జీవో ఉన్నప్పటికీ అ జీవోను ఇఓ తుంగలో తొక్కడం జరిగిందని చెప్పారు. అలాగే అర్చకులు ఇంట్లోనే పెట్టుకొని తాయిత్తులు విక్రయాలు చేస్తున్నారని చెప్పారు. దేవస్థానం తరపున తాయత్తులను విక్రయాలు చేసుకోకుండా అర్చకులు విక్రయించుకొని డబ్బులు సంపాదిస్తున్నారని ఆరోపించారు. గండి దేవస్థానాన్ని సొంత ఆస్తి లాగా అర్చకులు భావిస్తున్నట్లు చెప్పారు.

గండిలో పనిచేసే అర్చకులు కోట్లు రూపాయల ఆస్తులను సంపాదించారని చెప్పారు. అర్చకులు సంపదించిన ఆస్తులపై కూడ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని కోరారు. గతంలో ఆలయ అభివృద్ధికి పాటుపడిన ఈవో ముకుందా రెడ్డిని మార్చేందుకు గండిలో పని చేసే అర్చకులు దాదాపు 20 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు భక్తులు కూడా చర్చించుకోవడం గర్హనీయం అన్నారు. గండి దేవస్థానం అభివృద్ధికి పాటు పడే మంచి అధికారిని నియామకం చేపట్టడంతో పాటు అర్చకులను మార్చాలని కోరారు.

విలేకరుల సమావేశంలో టిడిపి నేతలు పాపిరెడ్డి శ్రీనువాసులు, బ్రహ్మానందరెడ్డి, వేమ కుమార్ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో బాత్రూం ఫోటోలు తీసే యాప్ ను తొలగించడం సంతోషదాయకం- ఏపిటిఎఫ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పాఠశాలలో బాత్రూముల శుభ్రతపై ఫోటోలు తీసి యాప్ లో అప్లోడ్ చేసే బాధ్యతలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పై గత వైసీపీ ప్రభుత్వం ఉంచింది. అయితే ఇలాంటి అవమానకరమైన బోధనేతర బాధ్యతల నుండి టీచర్ల నుండి తప్పించాలని ఉపాధ్యాయ సంఘాలు పలు మార్లు కోరినా అప్పటి ప్రభుత్వంతొలగించలేదు.

ప్రస్తుత ముఖ్యమంత్రి సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈ అవమానకరమైన బోధనేతర బాధ్యతలు, బాధల నుంచి విముక్తి కల్పిస్తూ సోమవారం నుండి యాప్ నందు బాత్రూం ఫోటోలు తీసే టైల్ ని తొలగించింది. గురువులకు గౌరవం ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఏపిటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, యస్.చిరంజీవి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## బాధితకుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**ఆళ్లగడ్డ (జర్నలిస్ట్ ఫైల్) :** నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలిలో మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. ఆ బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పరామర్శించారు. ఈ కుటుంబంలో అందరినీ కోల్పోయిన ప్రసన్న అనే బాలికకు అండగా ఉంటామని అఖిలప్రియ హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు బాధిత కుటుంబానికి రూ. 10 లక్షలు, బాలిక బాగోగులు చూసుకునేందుకు ఆమె నానమ్మకు రూ. 2 లక్షలు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బాలిక ఎంత వరకు చదివితే అంతవరకు ఎన్టీఆర్ పాఠశాలలోనే చదివిస్తామని ఐటీ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. పట్టణంలో ఎక్కడైనా పాతపడిన మట్టిమిద్దెలు ఉంటే అధికారులకు సమాచారమివ్వాలని, వర్షాకాలం కాబట్టి మట్టి మిద్దెలు ఉన్న వారందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

## అనుమతులు లేకుండా నడుస్తున్న బద్వేల్ పబ్లిక్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలి

### ○ఆర్ ఎస్ యు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా

**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** గత రెండు సంవత్సరాలుగా ఎటువంటి అనుమతులు లేకుండా నడుస్తున్న బద్వేల్ పబ్లిక్ స్కూల్ పై చర్యలు ఎందుకు తీసుకోలేదని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట సోమవారం నాడు ధర్నా చేసి అనంతరం సూపర్నెంట్ కు వినతిపత్రం అంద జేశారు.

ఈ సందర్భంగా ఆర్ ఎస్ యు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలు నుంచి బద్వేల్ పబ్లిక్ స్కూల్ కు ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతున్న కూడా స్థానికంగా ఉన్నటువంటి మండల విద్యాశాఖ అధికారి చెన్నయ్య ఎందుకు చర్యలు తీసుకోలేదు అని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం నాడు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట బద్వేల్ స్కూల్ పై చర్యలు తీసుకువాలని బద్వేల్ లో



ఆందోళన చేస్తే ఆర్ ఎస్ యు నాయకులకు వివిధ వ్యక్తులతో ఫోన్ చేయించి బెదిరించరని ఆయన అన్నారు. సీబీఎస్ఈ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర వేలాది రూపాయలు దండుకోవడమే కాకుండా ఆ పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి కూడా లేకుండా పాఠశాల ఏవిధంగా నిర్వహిస్తారని ఆయన అన్నారు. ఆ పాఠశాలలో దాదాపు 300 మంది విద్యార్థులు అక్కడ చదువుతున్నారు అని వాళ్ళ జీవితాలు అస్తవ్యస్తమయే అవకాశం ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారులు మాము ళ్ళ మత్తులో మునిగితేలుతున్నారని అందువల్లనే ఆ పాఠశాలపై గత రెండు సంవత్సరాల నుంచి ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం కారణమని ఆయన అన్నారు. డిప్యూటీ డిఈఓ,మండల విద్యాశాఖ అధికారిపై అనేక ఆరోపణలు ఉన్నాయని కావున విచారణ జరిపి ఆయన చేసే అవినీతి పై విచారణ జరపాలని వారి డిమాండ్ చేశారు. 300 మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసిన డాక్టర్ క్రాంతి కుమార్ పై కేసు నమోదు చేసి విద్యార్థులకు న్యాయం చేసే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు... అమరావతి కేంద్రంగా ఆందోళన చేసిలేకుంటే విద్యాశాఖ కమిషనర్ గారికి పిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి నగర అధ్యక్షుడు కొండేటి హరిబాబు కిరణ్. సుకుమార్. సురేష్. ఇర్ఫాన్. ప్రతాప్ తదితులు పాల్గొన్నారు.

## నూజివీడులో దారుణం.. ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం

**నూజివీడుటౌన్ (జర్నలిస్ట్ ఫైల్) :** ఏలూరు జిల్లా నూజివీడు మండలంలో దారుణం చోటు చేసుకుంది. పల్లెర్లమూడి గ్రామంలో ఐదేళ్ళ చిన్నారిని ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని పామాయిల్ తోటలో అత్యాచారం చేసి పాపను అక్కడే వదిలేసి పారిపోయారు. అపస్మారక స్థితిలో పడివున్న బాలికను తెల్లవారుజామున గుర్తించిన గ్రామస్తులు నూజివీడు ప్రభుత్వాసుపత్రికి వైద్యం అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందుతుల కోసం గాలింపు చేపట్టారు.

## రాష్ట్ర వ్యాప్తంగా భూ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా భూ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఈ అక్రమాలు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందన్నారు. మీడియాతో మాట్లాడుతూ... మదనపల్లిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భారీ భూ అక్రమాలకు పాల్పడ్డారని.. ఆయన భార్య పేరు మీద వందల ఎకరాలు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూ బాధితులతో 20న సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్క బాధితునికి న్యాయం జరిగేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరారు.

చంద్రబాబు స్పందన బాగుందని.. ఆ తర్వాత చర్యలు ఉండటం లేదని వెల్లడించారు. రాయలసీమలో కరవు పరిస్థితులపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వెంటనే పెట్టుసాయం రూ. 20 వేలు అందించాలన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా అందివ్వాలని తెలిపారు. ఇజ్రాయల్ దాడుల కారణంగా ప్రపంచ యుద్ధం వచ్చే పరిస్థితి ఉందన్నారు. అగ్రదేశం అమెరికా దీనికి మద్దతు



పలకడం సరైంది కాదన్నారు. ప్రధాని మోదీ కూడా పాలిస్తీనాకు అండగా నిలబడాలని సీపీఐ నేత రామకృష్ణ కోరారు. కాగా.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూ అక్రమాలపై టీడీపీ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. పెద్దిరెడ్డి అవినీతి అక్రమాలపై టీడీపీ శ్రేణులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని నిర్ణయించారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు పుంగనూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఆవులపల్లి ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలపై రైతులతో క్షేత్రస్థాయి పర్యటనలో ముఖాముఖి నిర్వహించనున్నారు. పెద్దిరెడ్డి అవినీతి అక్రమాలపై ఆయన కంచుకోట అయిన పుంగనూరులో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు.

నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో టీడీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి చల్ల రామచంద్రారెడ్డితో పాటు పలువురు టిడిపి బృందం కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవినీతి అక్రమాలు, భూముల దందాపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి అవినీతి అక్రమాలను బయటకు తీసే క్షేత్రస్థాయి పర్యటనకు శ్రీకారం చుడుతున్నామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఇటవలే మీడియాతో పేర్కొన్న విషయం తెలిసిందే.

## వీఎంసీ ఆధ్వర్యంలో పార్కు నిర్వహణ.. మంత్రి నారాయణ

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** వెటర్నరీ కాలనీలోని వీఎంసీ పార్క్ లో నూతనంగా నిర్మించిన జిమ్ ను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. వెటర్నరీ కాలనీ వాసులు జిమ్ కోసం సొంతంగా డబ్బు సమకూర్చారన్నారు. వీఎంసీ ఆధ్వర్యంలో ఈ పార్కు నిర్వహణ జరుగుతుందన్నారు. గ్రీన్ డెవలప్మెంట్, పర్యావరణంపై సీఎం చంద్రబాబుతో చర్చించానని తెలిపారు. కాలనీల్లో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని సమస్యలు తనకు చెప్పారని..వాటిని పరిష్కారిస్తామన్నారు. వారం క్రితం మున్సిపల్ అధికారులతో సమీక్ష చేశానని మంత్రి నారాయణ తెలిపారు.

గత ఐదేళ్లల్లో అసలు ఏం చేశారో తెలుసుకున్నామని పేర్కొన్నారు. మనకు నిధులు కొరత చాలా ఉందని.. రూ. 27 వేల కోట్లు కేంద్రం నిధులు రాష్ట్రానికి రావాలని మంత్రి నారాయణ పేర్కొన్నారు. రూ. 17 వేలు కోట్లు కేంద్రం, 17 వేల కోట్లు రాష్ట్రం ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల



కేంద్రం నిధులు నిలిపేశారన్నారు. స్వచ్ఛ భారత్ తరపున నిధులు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర వాటా నిధులు ఇవ్వక పోవడం వల్ల ఆ నిధులూ ఆగిపోయాయని పేర్కొన్నారు. ఈ విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీజేఎంఎస్‌లో రూ. 19 కోట్లు కాగితాల్లో ఉన్నాయని.. డబ్బు మాత్రం లేదని మంత్రి నారాయణ తెలిపారు. ఆ నిధులు మొత్తం ఇతర అవసరాలకు మళ్లించేశారన్నారు. ఇలాంటి ఎన్నో ఇబ్బందులు ఇప్పుడు తమకు ఎదురవుతున్నాయన్నారు. సీఎం సహకారంతో కేంద్రం నుంచి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. మున్సిపల్ మంత్రిగా నారాయణ అనేక నూతన విధానాలను అమలు చేశారన్నారు. 2014-2019 మధ్య కాలంలో పట్టణాలు, నగరాలు సుందరీకణ చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ మున్సిపల్ మంత్రి గా తన పని తీరుతో ఆకట్టుకుంటున్నారని పేర్కొన్నారు.

విజయవాడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి సమస్య బాగా ఉందన్నారు. మురుగు నీరు రోడ్ల పై నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు పడితే ప్రజలు ఆనీటితో సహజీవనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గత ఐదేళ్లల్లో నగర అభివృద్ధిని అసలు పట్టించుకోలేదన్నారు. మంత్రి నారాయణ ఒక డ్రైవ్ పెట్టి సమస్యలు పరిష్కారానికి సహకరించాలని గద్దె రామ్మోహన్ కోరారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467